హైదరాబాద్ వార్త



# చిన్నకుంటలపై హైడ్రా ఫోకస్



- ఓఆర్ఆర్ పరిధిలో దాదాపు 300లకుపైగా ఆక్రమణలు
- ఒక్కోకుంట విస్తీర్ణం దాదాపు 4నుంచి 5ఎకరాలు
- పలుప్రాంతాల్లో ప్లాట్లు, నిర్మాణాలు ఉన్నట్లు గుర్తింపు
- సర్వేఆఫ్ ఇండియా, ఎన్ఆర్సి,జిఐఎస్ ద్వారా డేటా గుర్తింపు
- దశవారీగా స్వాధీనం చేసుకునే దిశగా అడుగులు

**హైదరాబాద్,ఫిబ్రవరి 13,ప్రభాతవార్త:** హైదరాబాద్ నగర పరిధిలో కనిపించకుండా పోతున్న చిన్న చిన్న కుంటలపై హైడ్రా ఫోకస్ పెంచింది. 4 నుంచి 5 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న వందలాది చిన్న కుంటలు అక్రమ కబ్జాలకు గురైనట్లు గుర్తించింది. రెవెన్యూ రికార్డుల్లో లేకపోయినా.. సర్వే ఆఫ్ ఇండియా మ్యాపుల్లో చెరువులుగా నమోదై ఉన్న ఈ కుంటలను రక్షించేందుకు దశలవారీ చర్యలు ప్రారంభించింది. ఔటర్ పరిధిలో దాదాపు 300కు పైగా చిన్న కుంటలు ఆక్రమణలకు గురయ్యాయని గుర్తించిన హైడ్రా వాటన్నింటినీ స్వాధీనం చేసుకోవడానికి సిద్ధమైంది. ముఖ్యంగా 4 నుంచి 5 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న అనేక చిన్న కుంటలను మట్టితో నింపి ప్లాట్లు వేయడం, నిర్మాణాలు చేపట్టినట్లు గుర్తించింది. ముఖ్యంగా ఔటర్ రింగ్ రోడ్ పరిధిలో ఈ అక్రమాలు ఎక్కువగా జరిగినట్లు అధికారులు చెబుతున్నారు. రెవెన్యూ రికార్డులు, గ్రామ మ్యాపుల్లో ఈ కుంటలు కనిపించకపోవడం వల్లే ఆక్రమణలు సులభమయ్యాయని అధికారులు గుర్తించారు. అయితే సర్వే ఆఫ్ ఇండియా మ్యాపులల్లో ఇవి స్పష్టంగా చెరువులుగా నమోదై ఉన్నాయని వెల్లడించారు. రికార్డుల్లో లేకపోవడాన్ని ఆసరాగా తీసుకుని కొందరు భూకబ్జాలకు పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. ఈ కుంటలు కనుమరుగైతే వర్షాకాలంలో నీటి నిల్వలు తగ్గిపోవడం, భూగర్భ జలాల పునరుత్పత్తి దెబ్బతినడం, లోతట్టు ప్రాంతాల్లో ముంపు సమస్యలు పెరగడం వంటి ప్రభావాలు ఉంటాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**రెవెన్యూ రికార్డుల్లో లేకపోవడంతో..**

రెవెన్యూ రికార్డుల్లో లేని సుమారు 300 కుంటలు కబ్జాలకు గురైనట్లు గుర్తించామని హైడ్రా కమీషనర్ రంగనాథ్ తెలిపారు. రెవెన్యూ రికార్డుల్లో లేకుండా చేసి ఆయా కుంటలను మాయం చేశారన్నారు. అలాంటి కుంటలను సర్వే ఆఫ్ ఇండియా మ్యాపులు, టోపో షీట్లు, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ ద్వారా డేటా ద్వారా గుర్తిస్తున్నామన్నారు. ఔటర్ పరిధిలో సుమారు 1300 చిన్నా, పెద్ద చెరువులు, కుంటలు ఉండగా అందులో సుమారు 300 కుంటలు మాయమయ్యాయని తెలిపారు. ఈ చిన్న చిన్న కుంటలు ఒక్కొకటి సుమారు ఐదెకరాల వరకు ఉన్నాయి. 300 కుంటలు కలిపి సుమారు 15వందల ఎకరాల స్థలం కబ్జాకు గురైందని. వీటి విలువ సుమారు 80 వేల కోట్ల రూపాయలు ఉంటుందని చెబుతున్నారు.అయితే కుంటలు కబ్జా చేసి న ప్రాంతాల్లో ఇప్పటికే ఇండ్లు వచ్చి ఉంటే వాటి ని ముట్టుకోమని...కేవలం ఖాళీ స్థలాలు ఉంటే మాత్రమే వాటిని స్వాధీనం చేసుకుంటామని తెలిపారు.

**దశలవారీగా పెన్సింగ్..**

కబ్జాలను అడ్డుకునేందుకు దశలవారీగా ఫెన్సింగ్ పనులు చేపట్టనున్నట్లు హైడ్రా ప్రకటించింది. ఇప్పటికే కొండాపూర్ పరిధిలోని జంగం కుంట వద్ద ఆక్రమణలను తొలగించి ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది. ఇలాంటి చిన్న కుంటలను గుర్తించి త్వరలో పబ్లిక్ డొమైన్లో నోటిఫై చేయాలని నిర్ణయించింది. చిన్న కుంటల గుర్తింపునకు హైడ్రా జీఐఎస్ టీం, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ సహకారంతో సమగ్ర సర్వే కొనసాగుతోంది. ఉపగ్రహ చిత్రాలు, పాత మ్యాపులు, భూసర్వే వివరాలను పరిశీలించి అసలు సరిహద్దులను గుర్తిస్తున్నారు. నగర భవిష్యత్ జల భద్రత దృష్ట్యా చిన్న జలవనరుల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని హైడ్రా స్పష్టం చేసింది. ఇప్పటికే నగరంలో చెరువుల పరిరక్షణ బాధ్యతలు తీసుకుని సక్సెస్ అయిన హైడ్రా ఇప్పుడు చిన్న కుంటల పరిరక్షణకు పూనుకుంది.

# కీసరగుట్టలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

**- గణపతి పూజ,యాగశాల ప్రవేశం -ద్వజారోహణంతో పూజలు షురూ -పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి**

**కీసర,ఫిబ్రవరి13,ప్రభాతవార్తః** తెలంగాణాలోనే సుప్రసిద్ద శైవక్షేత్రమైన కీసరగుట్ట శ్రీ భవానీ శివదుర్గా సమేత రామలింగేశ్వరస్వామి స్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు శుక్రవారం అంకురార్పణ జరిగింది.మేడ్చల్ నియోజకవర్గ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి,ఆలయ చైర్మన్ తటాకం వెంకటేశ్శర్మ,ఈఓ కట్టా సుధాకర్రెడ్డి చేతుల మీదుగా విఘ్నేశ్వర పూజతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు.పుణ్యాహవచనం,రుత్విక్ వరణం అనంతరం యాగశాల ప్రవేశం చేసి ముక్కోటి దేవతలను ఆహ్వానించారు.అనంతరం అఖండ జోనయతి ప్రతిష్టాపనం,అగ్ని ప్రతిష్టాపన, భేరిపూజ, ద్వజారోహణం,ద్వాత్రింశతి రాగాలాపన, మంత్రపుష్పం,పరాకస్తవం తదితర పూజలు చేశారు. బ్రహ్మోత్సవాల్లో ఆరు రోజుల పాటు వైదిక కార్యక్రమాలు కీసరగుట్టలోని వేద పండితులు,విద్యార్దులు ఆద్వర్యంలో నిర్వహిస్తారు.బ్రహ్మోత్సవ పూజల్లో పాల్గొన్న వేద పండితులకు,విద్యార్దులకు పూజా వస్త్రాలను అందజేశారు.వేద పండితులు మార్తి సత్యనారాయణ శర్మ,గణపతి శర్మ బ్రహ్మోత్సవ విశేషాలను భక్తులకు వివరించారు.ప్రధాన అర్చకులు బలరామ శర్మ,ఉప ప్రధాన అర్చకులు రవికుమార్శర్మ, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.



మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

**స్వామి వారి సేవలో ఎమ్మెల్యేః**

కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి మహ శివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం స్వామి వారిని దర్శించుకున్నారు.ఆలయ వేద పండితులు ఎమ్మెల్యేకి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.గర్భాలయంలోని మూలవిరాట్కి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఆలయ అర్చకులు మహ మండపంలో వారికి తీర్ద ప్రసాదాలు, ఆశీర్వచనం అందజేశారు.

**నేడు స్వామి వారి కళ్యాణం ః**

మహాశివరాత్రి పర్వదినానికి ముందు రోజు రాత్రి శ్రీ భవానీ శివదుర్గా సమేత రామలింగేశ్వరస్వామికి కళ్యాణం అత్యంత వైభవోపేతంగా నిర్వహించడం సాంప్రదాయంగా వస్తుంది.శనివారం రాత్రి 10 గంటలకు నిర్వహించే స్వామివారి కళ్యాణానికి దేవస్థానం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.

# ఒకే కాలనీలో 6 పార్కులను కాపాడిన హైడ్రా

**-మరో చోట 1452ల గజాల పార్కు -రూ. 37.12 కోట్ల విలువైన భూములకు ఫెన్సింగ్**

**హైదరాబాద్, ఫిబ్రవరి 13,ప్రభాతవార్త:** ప్రాణవాయువును అందించే పార్కుల కబ్జాలను హైడ్రా సీరియస్గా పరిగణిస్తోంది. ఫిర్యాదు అందిన వెంటనే రంగంలోకి దిగి వాటిని రక్షిస్తోంది. ఇలా శుక్రవారం ఒకే రోజు ఒకే కాలనీలో 6 పార్కులను కాపాడి 2260 గజాల స్థలానికి ఫెన్సింగ్ వేసింది. మరో చోట 1452ల గజాలకు పైగా ఉన్న పార్కు స్థలాన్ని కబ్జాల నుంచి విడిపించింది. మొత్తం మీద 3712 గజాల విస్తీర్ణంలో పార్కులు అందుబాటులోకి రావడంతో ఆయా ప్రాంతాల్లో పండగ వాతావరణం నెలకొంది. స్థానికులు పెద్దయెత్తున బయటకు వచ్చి పార్కుల కబ్జాలను తొలగించిన హైడ్రాకు అనుకూలంగా నినాదాలు చేశారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుత్బులాపూర్ మండలం, జీడిమెట్ల విలేజ్, సుభాష్ నగర్ పరిధిలోని భాగ్యలక్ష్మి కాలనీ లేఔట్ను 1968లో వేశారు. 80 ఎకరాలలో 810 ప్లాట్లతో ఈ లేఔట్ వేసి ఇందులో 10 పార్కులను కేటాయించారు. జీడిమెట్ల పారిశ్రామిక వాడకు విద్యుత్ను అందించేందుకు వేసిన హైటెన్షన్ కరెంటు లైను ఈ లే ఔట్ మీదుగా వెళ్లింది. దీంతో హైటెన్షన్ విద్యుత్ లైన్ల కింద పలు పార్కులను అప్పటి లే ఔట్ వేసిన వారు కేటాయించారు. వేరే లైను ద్వారా పారిశ్రామిక వాడకు విద్యుత్ను అందించడంతో భాగ్యలక్ష్మి కాలనీ మీదుగా వెళ్లే హైటెన్షన్ వైర్లను 20 సంవత్సరాల క్రితం తొలగించారు. ఇక అక్కడి నుంచి ఆక్రమణలు జరుగుతున్నాయి. స్థానిక అధికారులకు చెప్పినా ప్రయోజనం లేకపోయిందని అక్కడి నివాసితులు హైడ్రా ప్రజావాణికి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు సంబంధిత శాఖలకు చెందిన వారితో హైడ్రా అధికారులు క్షేత్ర స్థాయిలో విచారించారు. అవి పార్కు స్థలాలుగా నిర్ధారించుకున్నారు. శుక్రవారం వరుసగా ఉన్న 6 పార్కుల ఆక్రమణలను తొలగించి హైడ్రా ఫెన్సింగ్ వేశారు.

**గుడిమల్కాపూర్లో పార్కు కబ్జాలకు విముక్తి..**

హైదరాబాద్ జిల్లా, ఆసిఫ్నగర్ మండలం గుడిమల్కాపూర్ గ్రామంలో ఏజీ ఆఫీస్ కోపరేటివ్ హౌసింగ్ సొసైటీ పేరిట 10 ఎకరాల్లో 83 ప్లాట్లతో దశాబ్దాల క్రితం లేఔట్ వేశారు. ఇందులో 79, 80, 81 నంబర్లతో ఉన్న ప్లాట్లు గుంతలో ఉన్నాయి. లేఔట్ను రివైజ్ చేసి ఇక్కడ ప్లాట్లున్నవారికి వేరే చోట కేటాయించారు. గుంతలా ఉన్న 1500ల గజాల స్థలాన్ని పార్కుగా పేర్కొన్నారు. ఆ గుంత పూడ్చి పార్కును చేయడంలో జాప్యం అవ్వడంతో అది కబ్జాదారులకు వరంగా మారింది. తర్వాత నిర్మాణాలు పెరగడంతో ఆ గుంతలు పూడ్చడం పెద్ద పని కాలేదు వారికి. ఇక అక్కడి నుంచి ఆ పార్కు స్థలాన్ని కబ్జా చేసి ఒకరు ఇసుక వ్యాపారం చేసుకుంటుండగా.. మరొక వ్యక్తి వాహనాల పార్కింగ్ కోసం వినియోగిస్తున్నారు. మరొకరు కొబ్బరి బొండాల వ్యాపారం చేసుకుంటున్నారు. ఈ పార్కును కాపాడాలని 2018లో జీహెచ్ఎంసీని అక్కడి నివాసితులు కోరారు. అయినా ప్రయోజనంలేదని వాపోయారు. ఈ అంశాలన్నిటినీ పేర్కొంటూ హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.

క్షేత్రస్థాయిలో విచారించి.. పార్కు స్థలంగా హైడ్రా అధికారులు నిర్ధారించుకున్నారు. శుక్రవారం ఆక్రమణ దారులను ఖాళీచేయించి సుమారు 1452 గజాల మేర హైడ్రా ఫెన్సింగ్ వేసింది. పార్కు స్థలంగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది.

# శిల్పవల్లి.. సివిల్లో వెళ్లి..!

**- పంజాగుట్ట పోలీస్ స్టేషన్లో సాధారణ ఫిర్యాదుదారిలా..!!**



**జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 13, ప్రభాతవార్తః** ఒక ఫిర్యాదుదారుడు పోలీస్ స్టేషన్కు వెళ్తే ఏదైనా ఇబ్బంది పడుతున్నారా లేక సాఫీగా ప్రక్రియ కొనసాగుతుందా..! మహిళా ఫిర్యాదుదారులు ఏదైనా ఇబ్బందులు పడుతున్నారా..! ఠాణాలో అధికారులు, సిబ్బంది ఎలా వ్యవహరిస్తున్నారు.. ఫిర్యాదుదారులతో ఎలా ప్రవర్తిస్తున్నారు..! ఇవే అంశాలను ప్రత్యక్షంగా తెలుసుకొనేందుకు ఖైరతాబాద్ జోన్ డీసీపీ కోగంటి శిల్పవల్లి ఒక సాధారణ ఫిర్యాదుదారురాలిలా పంజాగుట్ట ఠాణాకు వెళ్లారు. దాదాపు గంటన్నరపాటు అక్కడ ప్రత్యక్షంగా పరిశీలించారు.. ఆమెను గుర్తించిన పోలీసు సిబ్బంది గంటన్నర తరువాత అసలు విషయం తెలుసుకొని కంగుతిన్నారు.. ఆమె చేపట్టిన ఈ అనూహ్య తనిఖీ ఇప్పుడు నగర పోలీస్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

**వాహనాన్ని దూరంగా నిలిపి..**

తన అధికార వాహనాన్ని కొంత దూరంగా నిలిపి వేసి, సివిల్ డ్రెస్లో పంజాగుట్ట పోలీస్ స్టేషన్లోకి ప్రవేశించిన ఆమె తొలుత ఎవరికి అనుమానం రాకుండా శ్రీనగర్కాలనీ నుంచి వచ్చినట్లు ఫిర్యాదు కేంద్రంలో ఉన్న సిబ్బందికి తెలియజేసింది. అదే సమయంలో స్టేషన్లో సిబ్బంది విధి నిర్వహణ, ఫిర్యాదుదారులతో వ్యవహరించే తీరు, పనితీరు, స్పందన శైలిని ప్రత్యక్షంగా పరిశీలించారు. పంజాగుట్ట పోలీస్ స్టేషన్ను గతంలో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జాతీయ స్థాయిలో ఉత్తమ రెండో ఠాణాగా గుర్తించింది. అలాంటి స్టేషన్లోనూ ప్రజల అనుభవం ఎలా ఉందన్న కోణంలో డీసీపీ స్వయంగా పరిశీలన చేపట్టినట్లు తెలుస్తుంది. తన అసలు గుర్తింపును వెల్లడించిన అనంతరం డీసీపీ శిల్పవల్లి ఏసీపీ, ఇన్స్పెక్టర్లను పిలిపించి సమీక్ష నిర్వహించారు. ప్రజలతో మరింత సానుకూలంగా వ్యవహరించాలని, ఫిర్యాదుల పరిష్కారంలో వేగం, పారదర్శకత ఉండాలంటూ పలు కీలక సూచనలు చేసినట్లు సమాచారం. ఉన్న తాధికారుల పర్యవేక్షణ ఎప్పు డైనా, ఏ రూపంలోనైనా ఉండొచ్చన్న సందేశాన్ని సిబ్బందికి బలంగా చాటి చెప్పిందని పోలీస్ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి.

**ఫిర్యాదుదారులకు దగ్గరగా..**

ఖైరతాబాద్లో మహిళ మెడలో గుర్తుతెలియని అగంతకులు గొలుసు చోరికి పాల్పడ్డారు. కొద్ది సమయంలోనే డీసీపీ శిల్పవల్లి నేరుగా సంఘటనాస్థలానికి చేరుకున్నారు. బాధితులతో నేరుగా మాట్లాడి జరిగిన సంఘటనపై ఆరా తీశారు. తద్వారా ఫిర్యాదుదారుల్లో ఒకింత ధైర్యాన్ని, ఆత్మస్థైర్యాన్ని నింపారు.

అలాగే ఇటీవల ఫోరెన్సిక్ ల్యాబ్లో జరిగిన అగ్ని ప్రమాద సంఘటన వ్యవహారంలోనూ ఇలానే స్పందించారు. తాజాగా పంజాగుట్ట ఠాణాలో ఫిర్యాదుదారులకు అందుతున్న సేవలు, ఠాణాల పనితీరుపై ఆమె చేసిన ఈ తనిఖీ ఇప్పుడు నెటిజన్ల నుంచి ఆమెకు ప్రత్యేక ప్రశంసలు అందుతున్నాయి.



పంజాగుట్ట ఠాణాలో సిబ్బందితో సివిల్ దుస్తుల్లో సమీక్షిస్తున్న డీసీపీ శిల్పవల్లి.

## ప్యారడైజ్ జంక్షన్ భూనిర్వాసితులతో కలెక్టర్ సమావేశం

**-పరిహారంపై ప్రభుత్వ విధివిధానాలు వెల్లడి**

**-నివాసితుల నుంచి అభిప్రాయాల సేకరణ**



తమ అభిప్రాయానికి కలెక్టర్ హరిచందనకు తెలియజేస్తున్న భూనిర్వాసితులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 13,ప్రభాతవార్త:** ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్ట్ భూ నిర్వాసితులతో జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి అభిప్రాయాలను తెలుసుకున్నారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో కమిటీ సభ్యులతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. పారడైజ్ జంక్షన్ నుండి షామీర్పేట్ ఓఆర్ఆర్ జంక్షన్ వరకు 18.70 కిలోమీటర్లు చేపట్టే కారిడార్ భూ సేకరణ ప్రక్రియలో భాగంగా హైదరాబాద్ పరిధిలోని ప్యారడైజ్ నుండి లోతుకుంట పరిధి వరకు 11.70 కిలోమీటర్ల భూ సేకరణకు సంబంధించి తిరుమలగిరి, కాకాగుడా, తోకట్ట అలాగే మచ్చ బొల్లారం గ్రామాలకు చెందిన భూ నిర్వాసితులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ సేకరణ ప్రక్రియలో పారదర్శకత, స్పష్టత ఉండేలా చర్యలు తీసుకుంటామని అలాగే ఎలివేటెడ్ కారిడార్ మార్గంలో ట్రాఫిక్ తగ్గింపు, కనెక్టివిటీ మెరుగుదల, పట్టణ మౌలిక సదుపాయాల బలోపేతానికి ఈఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్ట్ వ్యూహాత్మకంగా ఎంతో ముఖ్యమని అన్నారు. తదుపరి ఎలివేటెడ్ కారిడార్ భూ నిర్వాసితులకు పరిహార విషయంలో ప్రభుత్వ విధివిధానాలు తెలియజేయడం అలాగే నిర్వాసితుల అభిప్రాయాలను కూడా ఈ సందర్భంగా స్వీకరించటం జరిగిందని అన్నారు. ఈకార్యక్రమంలో కమిటీ సభ్యులు భూసేకరణ అధికకారి అపర్ణ, హెచ్ఎండిఏ భూసేకరణ అధికారి అర్చన,ఆర్అండ్బి,సంబంధిత శాఖ అధికారులు,భూనిర్వాసితులు పాల్గొన్నారు.

## పారిశుధ్య నిర్వహణపై ఎంఎంసి కమిషనర్ సమీక్ష



పారిశుధ్య సమస్యలపై అధికారులతో సమీక్షా నిర్వహిస్తున్న మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.వినయ్కృష్ణారెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త** పారిశుధ్య నిర్వహణపై మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వినయ్కృష్ణారెడ్డి అధికారులతో సమీక్షా నిర్వహించారు. తార్నాకలోని ఎంఎంసి కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఇంటింటి నుండి చెత్త సేకరణ, కార్మికుల హాజరు, చెత్త సేకరణ వాహనాల జిపిఎస్ ఆధారిత పర్యవేక్షణ, దోమల నివారణ చర్యలపై అధికారులను సమీక్షించారు. ఈ సమావేశంలో ఎంఎంసి అదనపు కమిషనర్ సి.ఎన్.రఘుప్రసాద్,జాయింట్ కమిషనర్ మోహన్రెడ్డి, డిఇఇలు, ఏ ఇలు, రాంకి సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఫలక్నుమా యాత్రుహిల్స్లో కూలిన ఇళ్లు

**- నలుగురికి గాయాలు**



ఇళ్లు కూలిన పరిసరాలను పరిశీలిస్తున్న ఇన్స్పెక్టర్ సీతయ్య

**చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త :** కొండపై గల ఇళ్లు ఉన్నఫళంగా కుప్పకూలి పక్కనే ఉన్న మరో ఇంటిపై పడటంతో అందులో నివసిస్తున్న ఇద్దరు మహిళలతో సహ మరో ఇద్దరు బాలురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే అప్రమత్తమై గదిలో చిక్కుకున్న నలుగురిని హుటాహుటిని అత్యావసర వాహనంలో ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారు చికిత్స పొందుతున్నారు. ఫలక్నుమా పోలీసుస్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటన వివరాలు...ఫలక్నుమా నవాబ్ సాహబ్ కుంట, యాత్రు హిల్స్కు చెందిన అబ్దుల్ వాసీమ్ ఖాన్ (40) ఇంట్లోని డ్రైనేజీ నీరు బయటకు వెళ్ళలేక భూమిలోకి ఇంకి ఆప్రాంతం పూర్తిగా గుల్లగా మారింది. గురువారం రాత్రి 11.20 గంటల ప్రాంతంలో ఉన్నఫళంగా కుప్పకూలి పక్కనే 10 అడుగుల దిగువన ఉన్న మరో ఇంటిపై కొంత, దానిని అనుకొని ఉన్న ఖాళీ స్థలంలో మరికొంత పడింది. గ్రానైట్లు, ఇటుకలు, గోడల శిథిలాలు ఆ ఇంటపై పడ్డాయి. దీంతో ఇంటి కొంత భాగం కూలిపోగ పైకప్పు సిమెంట్ రేకులు పూర్తిగా ధ్వంసమైయ్యాయి. మిగిలిన ఆ ఇంటి గోడలు బీటలు వారాయి. ఆ సమయంలో ఆగదిలో ఉన్న జఖియా బేగం (60), రజియా బేగం (40), మహ్మద్ ఫైజన్ (13), మహ్మద్ సులేమాన్ ఖాన్ (9)ల తలకు, కాళ్లకు గాయాలైయ్యాయి. గది పక్కనే ఉన్న మరో గది, ఆ ఇంట్లోని ఫర్నీచర్, గృహోపకరణాలు ఇతరత్ర వస్తువులు పూర్తిగా ధ్వంసమైయ్యాయి. విషయం తెలుసుకున్న ఫలక్నుమా ఏసీపీ ఎం.ఎ.జావీద్, ఫలక్నుమా ఇన్స్పెక్టర్ ఎ.సీతయ్యలు పోలీసు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని, స్థానికులతో కలిసి గాయపడ్డ క్షతగాత్రులను అత్యవసర వాహనంలో ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారు చికిత్స పొందుతున్నారు. ప్రాణాపాయస్థితి నుండి బయటపడ్డారు. విషయం తెలుసుకున్న బహదూర్పురా ఎమ్మెల్యే ముహమ్మద్ ముబీన్ ఉస్మానియాకు చేరుకొని క్షతగాత్రులను పరామర్శించారు. వారి పరిస్థితిని డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన చికిత్స అందించాలని కోరారు. ఎంపి అసదుద్దీన్ ఓవైసీతో చర్చించి ప్రభుత్వం నుండి తగిన విధంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అయితే కొండపై ఉన్న ఇళ్లు కూలిన చోట భీతావాహ పరిస్థితి నెలకొం ది. ఇళ్లను ఆనుకొని ఉన్న ఖాళీ స్థలం, పక్కనే ఉన్న ఇంటిపై శిథిలాలు పడ టంతో భూకంప పరిస్థితి నెలకొంది. అక్కడే ఉన్న కూలిన ఇంటి యజమాని బులెట్ పాడైయ్యింది. బాధితుడు యూనుస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కూలిన ఇంటి యజమాని అబ్దుల్ వాసీమ్ ఖాన్పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# 'జంట'గా 'చోరీలు'!

**- దొరకని ప్రధాన సూత్రధారి**

**- జూబ్లీహిల్స్ దోపిడిలో మరో అయిదుగురు అరెస్ట్**

**జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 13, ప్రభాతవార్తః** సైఫాబాద్లో రూ. 80 లక్షల దోపిడి.. తాజాగా జూబ్లీహిల్స్లో దాదాపు రూ. 1.3 కోట్ల దోపిడి.. ఈ రెండు దోపిడీల వెనుక ఉన్న ప్రధాన సూత్రధారి జిబన్ చంద్. అతనితోపాటు ఈ చోరీల్లో జంటగా జిబన్ చంద్తో సహజీవనం చేస్తున్న బీమ్లా అలియాస్ భవిసరా కడేల్ అలియాస్ దేవి అలియాస్ సుస్మిత ఉంటుంది. వీరిద్దరు పథకం వేస్తే పక్కా అమలు చేసుకొని వెళ్తారు. అలాంటి ఈ ఇద్దరి కోసం ఇప్పుడు టాస్క్ఫోర్స్తోపాటు స్థానిక పోలీసులు గాలిస్తున్నారు. 2021లో సైఫాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో యజ్ఞ అగర్వాల్ నివాసంలో పనిచేసే జిబన్ చంద్ మరికొంతమంది నేపాలీలతో కలిసి చోరికి పాల్పడ్డారు. నగలు తీసుకొని తనతోపాటు సహజీవనం చేస్తున్న దేవిని తీసుకొని నేపాల్ పారిపోయాడు. దీంతో పోలీసులు అప్పటి నుంచి ఇప్పటి వరకు వారిద్దరిని పట్టుకోలేకపోయారు. ఈ క్రమంలోనే నగరంలోకి వచ్చిన జిబన్ చంద్ మరోసారి తన పథకాన్ని అమలు చేశాడు. ఇందులో భాగంగా నేపాలి ఏజెంట్గా వ్యవహరించే మదన్ సాయంతో నేపాల్కు చెందిన భూపేందర్ షాహి అలియాస్ భువన్ను జూబ్లీహిల్స్ నందగిరి హిల్స్లో పనిలో పెట్టించాడు. పథకం ప్రకారం దోపిడికి పథకం వేశాడు. ఇందులో భువన్తోపాటు రమేష్చంద్(23) కృష్ణచంద్ను దోపిడికి పంపాడు. దోపిడి అనంతరం వారు ఎక్కడికి వెళ్లాలి, ఎవరిని కలవాలి, దోపిడికి పాల్పడిన బంగారాన్ని ఎలా నగదుగా మార్చాలి తదితర అంశాలన్నింటిని పథకరచన చేశాడు. ఈక్రమంలోనే చోరి అనంతరం భువన్ నేరుగా సైబరాబాద్ పరిధిలో ఒక హోటల్లో పనిచేస్తున్న దేవి వద్దకు వెళ్లారు. అక్కడి నుంచి నేరుగా ముంబైకి వెళ్లి అక్కడి నుంచి నేపాల్కు బయలుదేరి పోలీసులకు భువన్తోపాటు కృష్ణచంద్ చిక్కారు. కాగా జిబన్ చంద్, దేవి ఇద్దరు దాదాపు ఆరేళ్లుగా కలిసి సహజీవనం చేస్తున్నారు. ఈ రెండు చోరీలే కాకుండా సైబరాబాద్ పరిధిలో మరిన్ని చోరీల్లో ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. దీనికితోడు కాచీగూడ, బర్కత్పుర ప్రాంతాల్లో జరిగిన చోరీల్లోనూ వీరి ప్రమేయం ఉన్నట్లు అనుమానిస్తున్నారు. ఈ దిశగా పోలీసులు విచారిస్తున్నారు. అయితే జూబ్లీహిల్స్ దోపిడికి వారం రోజుల ముందు జిబన్ చంద్ నేపాల్కు వెళ్లాడు. దీంతో దేవిని టాస్క్ఫోర్స్ పోలీసులు ఇప్పటికే అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలుస్తుంది. బస్టాండ్లో పల్లీలు అమ్ముకుంటున్న తనను జిబన్ చంద్ హైదరాబాద్కు తీసుకొచ్చాడని, ఇద్దరు కలిసి నివసిస్తున్నట్లు పోలీసుల విచారణలో ఆమె అంగీకరించినట్లు తెలుస్తుంది. అయితే సైఫాబాద్ దోపిడి తరువాత నేపాల్ వెళ్లిన జిబన్ తిరిగి నగరానికి వచ్చినప్పటికి టాస్క్ఫోర్స్ పోలీసులు అతనిపై దృష్టి పెట్టకపోవడం గమనార్హం.



జిబన్ చంద్, దేవి

**అయిదుగురు అరెస్ట్..**

జూబ్లీహిల్స్ దోపిడి కేసులో ఇప్పటికే పోలీసులు భూపేందర్ షాహి అలియాస్ భువన్తోపాటు కృష్ణచంద్ను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ. 1.3 కోట్ల విలువైన బంగారు వజ్రాభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఇదిలా ఉండగా దర్యాప్తులో భాగంగా పోలీసులు ఈ దోపిడితో ప్రమేయం ఉన్న మరో అయిదుగురిని శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో ముంబైలో ఆశ్రయం కల్పించిన లలిత్ బహదూర్ చంద్(26), జన్ విక్రమ్ షాహి(22), రమేష్ చంద్(23), సుశీల్ బొహ్రా(30), ఏజెంట్ మదన్(32) ఉన్నారు. వీరిని శుక్రవారం కోర్టులో హాజరుపర్చినట్లు జూబ్లీహిల్స్ పోలీసులు తెలిపారు. ఈ కేసుతో ప్రమేయం ఉన్న ప్రధాన నిందితుడు జిబన్ చంద్ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

## అభివృద్ధి చేసే వరకు పోరాటం చేస్తాం : వెంకీ ముదిరాజ్



సమావేశంలో మాట్లాడుతున్న వెంకీ ముదిరాజ్, చిత్రంలో బీఆర్ఎస్ నేతలు.

**జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఫిల్మ్‌నగర్‌లోని 18 బస్తీల్లో అభివృద్ధికి కుంటుపడిందని ఫిల్మ్‌నగర్ డివిజన్ బీఆర్ఎస్ నాయకుడు వెంకీ ముదిరాజ్ ఆరోపించారు. ఫిల్మ్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన బీఆర్ఎస్ నాయకులతో కలిసి మాట్లాడారు. బీఆర్ఎస్ నేతలు ఉన్న డివిజన్లలో అభివృద్ధి పనులను అధికార పార్టీ పట్టించుకోవడం లేదన్నారు. అంతే కాకుండా బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లిన కార్పొరేటర్ల డివిజన్లలోనూ అదే పరిస్థితి కనిపిస్తుందన్నారు. ప్రధానంగా ఫిల్మ్ నగర్ 18 బస్తీల్లో అనేక అసౌకర్యాలున్నాయని, వాటిపై అటు అధికార పార్టీ దృష్టి పెట్టడం లేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో కేటీఆర్ మంత్రిగా ఉన్న సమయంలో జరిగిన అభివృద్దే ఇప్పటికీ కనిపిస్తుందన్నారు. ఫిల్మ్‌నగర్ జూనియర్ కళాశాలతోపాటు, చాలా మేర బస్తీల్లో సామాజిక భవనాల నిర్మాణం, అంగన్‌వాడీ భవనాలు, బీజేఆర్ నగర్‌లో ప్రభుత్వ పాఠశాల నిర్మాణం, ఆసుపత్రి నిర్మాణం చేపట్టే వరకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తమ పోరాటం కొనసాగుతుందన్నారు. ఫిల్మ్‌నగర్ డివిజన్‌లో ఉద్యమకారులను కలుపుకొని పార్టీని మరింత బలోపేతం చేస్తామన్నారు. ప్రజా సమస్యలపై తమ పోరాటం నిరంత రం కొనసాగుతుందన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నేతలు జ్యోతి స్వరూప్, కట్టా లక్ష్మణ్, చైతన్య, శ్రీకాంత్, సునీల్‌రెడ్డి, వినోద్ పాల్గొన్నారు.

## 1న ప్రభుత్వ మహిళా పెన్షనర్స్‌కు క్రీడా పోటీలు




సమావేశంలో మాట్లాడుతున్న ఉమాదేవి

**సైఫాబాద్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యోగులకు హెల్త్ స్కిమ్, క్యాష్‌లెస్ హెల్త్ కార్డులపై జివొ విడుదల చేయడంపై తెలంగాణ ప్రభుత్వ మహిళా పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధి బృందం హర్షం వ్యక్తం చేసింది. క్యాష్‌లెస్ హెల్త్ కార్డు పనిచేయకపోవడం వల్ల పెన్షనర్స్ చాల ఇబ్బందులకు గురైనారని, కొంతమందికి వైద్యం లభించిక మరణించారని అసోసియేషన్ ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన మీడియా సమావేశంలో అసోసియేషన్ ఛైర్‌పర్సన్ ఉమాదేవి మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల్లో పనిచేసి రిటైర్‌యిన తమకు సిఎం రేవంత్‌రెడ్డి పెద్ద కొడుకులాగా అండగా నిలిచారని కొనియాడారు. తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన మహిళా ఉద్యోగులకు సిఎం ప్రోత్సహకాలు అందించాలని కోరారు.అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మార్చి 1వ తేదీన తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎల్‌బి స్టేడియంలో విశ్రాంత మహిళా పెన్షనర్స్‌కు ఇండోర్ గేమ్స్ నిర్వహిస్తున్నామని, ఈ క్రీడలను స్పోర్ట్స్ చైర్మన్ శివసేనరెడ్డి ప్రారంభిస్తారని చెప్పారు. అలాగే మార్చి 10వ తేదీన బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నామని ముఖ్యఅతిథులుగా ఐఎఎస్, ఐపిఎస్ అధికారులు పాల్గొంటారని ఆమె చెప్పారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు కె.ధనలక్ష్మి, భాగ్యలక్ష్మి, వరూధిని, పి.సుగుణ, లలిత, రాధారుక్మిణి, శ్యామల, పద్మజా తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే నవీన్ యాదవ్



బోరబండ ప్రొఫెసర్ జయశంకర్ కమ్యూనిటీ హాల్‌లో కళ్యాణ లక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే నవీన్ యాదవ్

**యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలన ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి పేద వాడికి అందేలా చూస్తుందని జూబ్లీహిల్స్ శాసనసభుయులు నవీన్ యాదవ్ అన్నారు. శుక్రవారం బోరబండలోని జయశంకర్ కమ్యూనిటీ హాల్‌లో 28 మందికి కళ్యాణ లక్ష్మి, 52 మందికి షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద కుటుంబాలలో ఆడ పిల్లల పెళ్లిళ్లకు ఆర్థిక భరోసా కల్పించే గొప్ప పథకం కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ అని అన్నారు. ప్రభుత్వం అందించే ప్రతి పథకం కూడా అర్హులకు అందేలా చూసే బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ప్రజలకు ఎలాంటి కష్టం వచ్చినా నేరుగా తనను సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపమేయర్ బాబా ఫసియుద్దీన్ సతీమణి హబీబా సుల్తానా, రవినాయుడు, ఖైరతాబాద్ తాహశీల్దార్ ప్రేమ్‌కుమార్, కవిత, యాదయ్య పాల్గొన్నారు.

## మహిళాలోకానికి ఆదర్శనీయులు సరోజినీ నాయుడు



కవి కోకిల సరోజిని చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

**చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త :** గాన కోకిల సరోజిని నాయుడు నేటి మహిళాలోకానికి ఆదర్శనీయులని దారుల్‌షిఫా ప్రభుత్వ బాలరు అంధుల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మండడి వెంకట్‌రెడ్డి, టీసీటీవీహెచ్ డైట్ లెక్చరర్ ఝాన్సీరెడ్డిలు అభిప్రాయపడ్డారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో భారత కవి కోకిల సరోజినీ నాయుడు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైదరాబాదులో పుట్టిన సరోజినీ నాయుడు భారత స్వాతంత్ర సంగ్రామంలో పాల్గొని మహిళల కొరకు ప్రత్యేకంగా ఉద్యమాన్ని నిర్వహించి, వారి హక్కుల కోసం ఎన్నో పోరాటాలు చేశారన్నారు. గాంధీజీతో కలిసి ఉప్పు సత్యాగ్రహంలో, సహాయ నిరాకరణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న వీర వనితని కొనియాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మొట్ట మొదటి మహిళ గవర్నర్‌గా నియమితులైన సరోజినీ నాయుడు మంచి కవయిత్రిగా రాణించిన విషయాన్ని గుర్తు చేశారు. ఆమె రచించిన ది గోల్డెన్ త్రిషోల్డ్ అనే పుస్తకం చాలా ప్రసిద్ధి చెందిందని తెలిపారు.కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు,ఛాత్రోపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## పెళ్లి పేరుతో యువతిని మోసగించిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

**సైఫాబాద్, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:** పెళ్లి చేసుకుంటానని ఒక యువతిని సాఫ్ట్‌వేర్ ఉద్యోగి నమ్మించి, మోసం చేసిన ఘటన నారాయణగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ సాయి సందీప్ తెలిపిన వివరాల ప్రకారం కృష్ణాజిల్లాకు చెందిన సురేష్(35) సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. హిమాయత్‌నగర్‌కు చెందిన ఒక యువతి షాదీ.కంలో ఒక యువతి తన ప్రొఫైల్ నమోదు చేసుకోగా, ఆ యువతి ప్రొఫైల్ చూసిన సురేష్ ఆమెతో ఫోన్ ద్వారా పరిచయం చేసుకుని, ఒక కేఫ్‌లో కలుసుకున్నారు. ఒకరోజు తనకు అత్యవసరంగా డబ్బులు అవసరం ఉందని చెప్పి ఆమె నుంచి 80వేల రూపాయలు తన ఖాతాకు బదిలీ చేయించుకున్నాడు. అనంతరం ఒకరోజు యువతి పెళ్లి గురించి ప్రస్తావించగా, సురేష్ ఆమె నెంబర్ బ్లాక్‌చేసి, తప్పించుకుపోయాడు. మోసపోయినట్లు గ్రహించిన యువతి నారాయణగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

# శివాలయాలలో బ్రహ్మోత్సవాలు...శివరాత్రికి విశేష పూజలు



కేశవగిరిపై గల అతిపురాతన శివాలయం

**చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త :** పాతబస్తీలోని పలు శైవాలయాలలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభమైయ్యాయి. మహాదేవుని అత్యంత భక్తి ప్రపత్తులతో ఆరాధించే భక్తులు ఒకవైపు శివ దీక్షలను కొనసాగిస్తుండగా మరోవైపు శివాలయాలలో ఉత్సవాలు షురువైయ్యాయి. చాంద్రాయణగుట్ట కేశవగిరిపై వెలసిన అతిపురాతన శివాలయంలో శుక్రవారం నుండి ఈనెల 17వ తేదీ మంగళవారం వరకు ఐదు రోజుల పాటు ఉత్సవాలను నిర్వహించేందుకు శివకేశవ భక్త సమాజం తగిన ఏర్పాట్లు చేసింది. బ్రహ్మోత్సవాల తొలిరోజైన శుక్రవారం అర్చకులు పరాంకుశం సుధీర్ కుమారాచార్యులు, జంగం గురుమూర్తిల ఆధ్వర్యంలో ఆలయంలో మహాదేవునికి ఆలయ ప్రవేశం, గణపతి పూజ, పున్యావాచనం, నవగ్రహారాధన, శివాభిషేకం, ధ్వజారోహణం పూజలు నిర్వహించారు. రాత్రి ఆలయ ప్రతినిధులు, స్థానిక ప్రజలు కలిసి భజనలు చేశారు. 14వ తేదీ శనివారం ఉదయం రుద్రాభిషేకం, స్వామి హారతి, భజన, 15వ తేదీ ఆదివారం మహా శివరాత్రి ప్రత్యేక పూజలు, ఉదయం 6గంటలకు మహాన్యాస రుద్రాభిషేకం, మధ్యాహ్నం 12 గంటలకు రుద్రహోమం, రాత్రి 10 గంటలకు శివపార్వతుల కల్యాణం, భజనలు, జాగరణ, తెల్లవారు జామున మహా హారతి, 16వ తేదీ సోమవారం ఉదయం 8గంటలకు శివపార్వతుల అభిషేకం, శ్రీ ఉమామహేశ్వరస్వామి వ్రతం, 17వ తేదీ మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు అన్నదానం, సాయంత్రం 6గంటలకు స్వామి వారి హారతి, ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఛత్రినాక శివగంగానగర్‌లోని శ్రీ లక్ష్మణేశ్వరస్వామి దేవాలయంలో ఉత్సవాలు వైభవంగా ప్రారంభమైయ్యాయి. అదేవిధంగా కేశవగిరిపై గల శ్రీ భ్రమరాంబదేవి సమేత చెన్నమల్లికార్జున స్వామి దేవాలయంలో ఈనెల 15వ తేదీ ఆదివారం ఆలయంలో స్వయంభుః మూల విరాటుకు, బ్రహ్మసూత్ర శివలింగానికి రోజంతా విశేష పూజలు, కార్యక్రమాలుంటాయని, భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి అమ్మవార్ల అనుగ్రహానికి పాత్రులు కావాలని ఆలయ ప్రధాన అర్చకులు కోటి హరీష్ కుమార్ కోరారు. ఉప్పుగూడ శ్రీ మహంకాళి మరకత లింగేశ్వరస్వామి దేవాలయంలో ఈనెల 15వ తేదీన ఉదయం 4గంటలకు మరకత లింగేశ్వర స్వామికి మహాన్యాస పూర్వక మహా రుద్రాభిషేకం, 16వ తేదీ సోమవారం సాయంత్రం 6.30 గంటలకు అగ్నిప్రతిష్ఠాపన పూర్వక శ్రీ రుద్ర సహిత దుర్గా హోమం, మహా పూర్ణాహుతి, తీర్థప్రసాద వితరణ పూజా కార్యక్రమాలుంటాయని, భక్తులు స్వామి అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని దేవాలయ కమిటీ కోరింది.

## అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు ప్రజల మద్దతు : బండి రమేష్



సంబరాల్లో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

**కెపిహెచ్‌బి కాలనీ, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త**

అభివృద్ధి సంక్షేమం లక్ష్యంగా పనిచేసే ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరిస్తారని మున్సిపల్ ఎన్నికల ఫలితాలు రుజువు చేశా యని టిపిసిసి ఉపాధ్యక్షుడు కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బుధవారం జరిగిన మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయ దుందుభి మోగించిన సందర్భంగా కెపిహెచ్‌బి కాలనీ టెంపుల్ బస్ స్టాప్‌లో శేరీ సతీష్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. స్వీట్లు పంచి బాణా సంచా కాల్చారు. ఒకరికొకరు అభినందనలు తెలియజేసుకున్నారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలతో తెలంగాణ ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని వారి అభిమానమే పార్టీని గెలిపించిందన్నారు. రాబోయే జెడ్పిటిసి, ఎంపిటీసీ గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లోను కాంగ్రెస్ పార్టీ తిరుగులేని విజయాన్ని సాధిస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభ్నుత్వ చేపట్టిన ప్రజాపాలనకు ప్రజల ఆదరణ ఉందన్నదానికి ఈ ఎన్నికల ఫలితాలే నిదర్శనం అన్నారు. థండర్ మెజార్టీ ఇవ్వడం ద్వారా తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై మరో మారు తమ అభిమానాన్ని చాటుకున్నారన్నారు. ప్రజాపాలనకు ఈ ఎన్నికల ఫలితాలు ఓ మైలురాయిగా నిలిచాయన్నారు. ఎన్నికల సందర్భంగా పార్టీ ఇచ్చిన అన్ని హామీలను అమలు చేసేందుకు సీఎం చిత్తశుద్ధితో ఉన్నారని రమేష్ పేర్కొన్నారు.కార్యక్రమంలో కార్యకర్తలు, డివిజన్ అధ్యక్షులు, మహిళ నాయకురాలు, యూత్ నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## హైడ్రా కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలిపిన బిఆర్ఎస్ నాయకులు




హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను సన్మానిన్నున్న ఎమ్మెల్యే బిఎల్ఆర్

**నాచారం, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త :** నాచారంలోని హెచ్ ఎంటి నగర్ పెద్ద చెరువు సుందరీకరణకు రూ.30 కోట్ల నిధులు మంజూరు చేయించడంతో ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి సమక్షంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్, విట్టల్ యాదవ్, భూపాల్ రెడ్డి, కట్ట బుచ్చన్న గౌడ్ తదితరులు పాల్గొన్నారు.చాలా సంవత్సరాలుగా చెరువులో పేరుకుపోయిన పూడిక, వ్యర్థ రసాయన జలాలు, మురుగునీటి ప్రవాహం కారణంగా గుర్రపు డెక్క విపరీతంగా పెరిగి దోమల సమస్య తీవ్రంగా మారిందని వారు పేర్కొన్నారు. ఇప్పుడు సుందరీకరణ పనులతో చెరువు పునరుద్ధరణ జరగడంతో పాటు దోమల సమస్యకు పూర్తిస్థాయిలో పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా పటేల్ కుంట చెరువును కూడా సుందరీకరించాలని నాయకులు కమిషనర్‌ను కోరగా, రెండో విడతలో పటేల్ కుంట చెరువు అభివృద్ధి పనులు చేపడతామని కమిషనర్ రంగనాథ్ హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## పరిణతవాణిలో వల్లీశ్వర్ సాహిత్య పాత్రికేయం



వల్లీశ్వర్‌ను సత్కరిస్తున్న శివారెడ్డి, చెన్నయ్య, రామమూర్తి

**నాంపల్లి, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త :** తెలంగాణ సారస్వత పరిషత్తు, హైదరాబాద్ 65 ఏళ్లు దాటిన ప్రఖ్యాత కవి పండితులు, ప్రముఖుల స్వీయసాహిత్య జీవిత విశేషాలను ఆవిష్కరింపజేసే ఉపన్యాస పరంపరలో బొగ్గులకుంట పరిషత్తులోని డా. దేవులపల్లి రామానుజరావు కళావేదికలో ప్రముఖ సాహితీవేత్త, పాత్రికేయుడు గండు వల్లీశ్వర్ తన సాహిత్య, పాత్రికేయం గురించి వివరించారు. పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన పరిణతవాణిలో ప్రధాన కార్యదర్శి డా. జె.చెన్నయ్య స్వాగతోపన్యాసం అనంతరం జి.వల్లీశ్వర్ ప్రసంగించారు. అధ్యక్షోపన్యాసంలో శివారెడ్డి సారస్వత పరిషత్తు నిర్విరామంగా నిర్వహిస్తున్న పరిణతవాణి ప్రహసనాన్ని సవివరపరిచారు. ఆంధ్రప్రభుత్వ మ్యాగజైన్‌తోపాటు తెలుగు పత్రికలు ఆంధ్రపత్రిక, ఆంధ్ర జ్యోతి, ఈనాడు, ఏలూరు టైమ్స్, న్యూస్‌టైమ్‌లలో సీనియర్ పాత్రికేయుడుగా పనిచేసినట్లు తన అనుభవాలను పంచుకున్నారు. చివరిగా ప్రసంగకర్త గుండు వల్లీశ్వర్‌ను ఘనంగా సత్కరించారు. రామమూర్తి వందన సమర్పణతో పరిణతవాణి విజయవంతంగా ముగిసింది.

## డాక్టర్ కె.వి. రమణాచారికి అభినందన సత్కారం



: ప్రభుత్వ పూర్వ సలహాదారులు డాక్టర్ కె.వి. రమణాచారి లను సత్కరిస్తున్న రాగరాగిణి సాహితి, సాంస్కృతిక సేవ సంస్థ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎంవి. రమణ కుమారి, ఎంవి.సుబ్బు లక్ష్మి

**చిక్కడపల్లి ఫిబ్రవరి 13 (ప్రభాతవార్త ) :** రాగరాగిణి సాహితి, సాంస్కృతిక సేవ సంస్థ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎంవి. రమణ కుమారి, ఎంవి.సుబ్బు లక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారులు, విశ్రాంత ఐఎస్ అధికారి డాక్టర్ కె.వి. రమణాచారి ని ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు తులసి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వహించే సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలను ఆయన ప్రశంసించారు.

## కార్తీక్‌రెడ్డిని కలిసిన హైదర్షాకోట్ బిఆర్ఎస్ నేతలు



**నార్సింగి, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త :** త్వరలో జరుగబోయే గ్రేటర్ ఎన్నికల నేపథ్యంలో తమకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని కోరుతూ హైదర్షాకోట్ డివిజన్ బిఆర్ఎస్ నాయకులు, మాజీ కార్పొరేటర్లు రవీందర్‌రెడ్డి, పద్మావతి పాండులు రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జి పి.కార్తిక్‌రెడ్డిని కలిశారు. గత ఐదేళ్ల కాలం ప్రజా ప్రతినిధులుగా ప్రజలకు మా వార్డులలో మెరుగైన సేవలు అందించామని, కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టి అభివృద్ధి పనులు చేశామని, వచ్చే గ్రేటర్ ఎన్నికల్లో సైతం మాకు అవకాశం కల్పిస్తే గెలిచి చూపిస్తామని కార్తిక్‌రెడ్డిని కోరినట్లు తెలిసింది. జెనరల్ సీటు అయితే నాకు అవకాశం కల్పించాలని రవీందర్‌రెడ్డి, ఎస్సీ రిజర్వేషన్ అయితే నాకు అవకాశం కల్పించాలని తలారి పద్మావతి పాండులు కోరినట్లు సమాచారం. బిసి రిజర్వేషన్ వస్తే గత ఏడాది కాలంగా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులుగా పని చేస్తున్న నాగరాజుకు అవకాశం ఇవ్వాలని నాయకులు సమాలోచన చేసినట్లు లీకులు వచ్చాయి. పైకి మర్యాదపూర్వకంగా కలిశామని చెప్పుకుంటున్నా, రాజకీయ అంశంపైనే చర్చించుకున్నట్లు తెలిసింది. బిఆర్ఎస్ అధ్యక్షుడు నాగరాజు లేకుండా కార్తిక్‌రెడ్డిని కలువడం గమనార్హం. కార్తిక్‌రెడ్డిని కలిసిన వారిలో బిఆర్ఎస్ నాయకులు పెంటయ్య, యాదయ్య, సందీప్, ప్రవీణ్ కుమార్, బాలయ్య ఉన్నారు.

## డ్యూటీ ఫ్రీ మద్యాన్ని పట్టుకున్న పోలీసులు

**-92 బాటిళ్లు స్వాధీనం 15 మంది నిందితుల అరెస్టు**

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:** ఇతర రాష్ట్రాల నుంచి డ్యూటీ ఫ్రీ మద్యాన్ని తరలిస్తున్న 15 మంది నిందితులను ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి 92 మద్యం బాటిల్లు, మూడు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన మీర్‌పేట ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మీర్‌పేట ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఎన్.శ్రీనివాసరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గోవా, ఢిల్లీ ఇతర రాష్ట్రాల నుంచి తెలంగాణ రాష్ట్రానికి డ్యూటీ ఫ్రీ మద్యం బాటిలను తరలిస్తున్న నాలుగు కేసుల్లో ఉన్న 92 మద్యం బాటిలను రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ బృందంతో ఎక్సైజ్ పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి స్వాధీనం చేసుకున్నారు. డ్యూటీ ఫ్రీ మద్యాన్ని తరలిస్తున్న మూడు వాహనాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు 15 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. మద్యాన్ని ప్రైవేటు టాక్సీ వాహనాలలో తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని తెలిపారు.

## అంబర్‌పేట పిటిసిలో ముగిసిన ఆయుధాల తనిఖీ



ఆయుధాలను తనిఖీ చేస్తున్న అసిస్టెంట్ కమాండెంట్ ఏడుకొండలు

**హైదరాబాద్ ఫిబ్రవరి 13 ( ప్రభాతవార్త ) :** రాష్ట్ర పోలీస్ శాఖలోని ఆయుధాల సామర్థ్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా అంబర్‌పేట పోలీస్ ట్రైనింగ్ కాలేజీలో నిర్వహించిన రెండు రోజుల స్మాల్ ఆర్మ్స్ ఇన్‌స్పెక్షన్ శుక్రవారంతో విజయవంతంగా ముగిసింది. యూసుఫ్‌గూడ బేస్ రిపేర్ వర్క్ షాప్ అసిస్టెంట్ కమాండెంట్ ఏడుకొండలు ప్రధాన తనిఖీ అధికారిగా వ్యవహరించి, ఆయుధాల స్థితిగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. ఆయుధాలను నిబంధనల ప్రకారం క్లీన్ చేయాలని, తుప్పు పట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఆయుధాల దీర్ఘకాలిక మనుగడకు అవసరమైన భద్రతా ప్రమాణాలను వివరించారు. ఆయుధ రిజిస్టర్ల నిర్వహణ తీరుపై సంతృప్తి వ్యక్తం చేస్తూ సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ శేఖర్ బాబు, ఏ.ఎస్.ఐ మల్లేశ్వర్ రావు, హెడ్ కానిస్టేబుల్స్ మరియు యూనిట్ అర్మోరర్లు పాల్గొన్నారు. ఆయుధాల నిర్వహణపై సిబ్బందికి అవగాహన పెంచేందుకు ఇటువంటి తనిఖీలు దోహదపడతాయని అధికారులు పేర్కొన్నారు.

# ఓయూలో ఘనంగా టెక్స్‌టైల్ వర్క్‌షాప్ ముగింపు



జ్ఞాపికను అందజేస్తున్న కార్యక్రమ నిర్వాహకులు

**తార్నాక, జనవరి 13 ప్రభాతవార్త :** టెక్స్‌టైల్ రంగంలో ఆధునిక సాంకేతికతలపై నిర్వహించిన ఐదు రోజుల వర్క్‌షాప్ శుక్రవారం ఘనంగా ముగిసింది. (ఎంఎస్‌ఎంఈ), ఓయూ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో కళాశాల ఈక్లాస్‌రూమ్‌లో ఆగ్మెంటెడ్ రియాలిటీ అండ్ వర్చువల్ రియాలిటీ ఫర్ టెక్స్‌టైల్ డిజైన్” అనే అంశంపై ఎడి... ఈఎస్‌డీపీ కార్యక్రమం నిర్వహించారు. యంఎస్‌ఎంఈ టెక్స్‌టైల్‌కు సంబంధించిన నూతన రంగంలో ఈ కార్యక్రమాన్ని స్పాన్సర్ చేసి నిర్వహించడం అభినందనీయమని ముఖ్య అతిథిగా హాజరైన ఆడిటర్ ఇంటర్ టెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఎన్. గిరిబాబు పేర్కొన్నారు.ముగింపు కార్యక్రమంలో ఎన్. గిరిబాబు ప్రసంగిస్తూ, ఆధునిక సాంకేతికతలతో టెక్స్‌టైల్ డిజైన్ రంగంలో కొత్త అవకాశాలు ఏర్పడుతున్నాయని తెలిపారు. క్రీపియా సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఉపాధ్యక్షుడు కె. నరహరి గెస్ట్ ఆఫ్ ఆనర్‌గా హాజరై మాట్లాడుతూ, ఈ కోర్సు ద్వారా అభ్యసించిన నైపుణ్యాలు తమ తమ రంగాల్లో లాభసాటిగా ముందుకు సాగేందుకు ఎంతో దోహదపడతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి. రమేష్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఎస్. శ్రీను నాయక్, టెక్స్‌టైల్ విభాగాధిపతి సీనియర్ ప్రొఫెసర్ జె. హయ వదన, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ డాక్టర్ అయోధ్య కవిత, ఎన్ఐఎంఎస్ఎంఈ కోఆర్డినేటర్ వి. స్వప్న, ఓయూ కోఆర్డినేటర్లు డాక్టర్ ధీరజ్ కుమార్, డాక్టర్ కె. శ్రీనివాసులు, డాక్టర్ అర్జున్, కె. శ్రీను, మనోజ్ తదితరులు పాల్గొన్నారు. టెక్స్‌టైల్ విభాగానికి చెందిన ఎంటర్‌ప్రెన్యూర్స్, ఫ్యాకల్టీ సభ్యులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## మున్సిపల్ ఎన్నికల్లో రేవంత్ సర్కార్ పాలనకు పట్టం : గొనె సల్మాన్ రాజ్



కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్ పాస్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ సీనియర్ నేత గొనె సల్మాన్ రాజ్

**చిక్కడపల్లి ఫిబ్రవరి 13 ( ప్రభాతవార్త ) :** తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించడం రేవంత్ సర్కార్ పాలనకు పట్టం కట్టారని గొనె సల్మాన్ రాజ్ అన్నారు. శుక్రవారం గాంధీనగర్ లో తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్ పాస్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, క్రైస్తవ సమాజ ప్రతినిధి, కాంగ్రెస్ సీనియర్ నేత గొనె సల్మాన్ రాజ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం పట్ల సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు మెన్నో జోయెల్ , బేనోని రిచర్డ్ , జయప్రకాశ్ , ప్రబోధ్ జయపాల్ తదితరులు పాల్గొన్నారు. సల్మాన్ రాజ్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంపై పార్టీ శ్రేణులు ప్రశంసలు కురిపించారు. ఓటర్ల విభజన రాజకీయాలకు బదులుగా స్థిరత్వం , సమ్మిళిత అభివృద్ధిని, సమాజ ఐక్యతను ఎంచుకున్నారని, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న క్రైస్తవ నాయకులు, సంస్థలు ఐక్య మద్దతుకు, ప్రజాస్వామ్య ప్రక్రియలో పార్టీ అంకితభావంలో పాల్గొనడానికి సమాజాన్ని సమీకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మైనారిటీల రాజ్యాంగ హక్కులను పరిరక్షించడానికి మరియు సమాజంలోని అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూర్చే సంక్షేమ పథకాలను అమలు చేయడానికి కాంగ్రెస్ కట్టుబడి ఉంది. “తెలంగాణ ప్రజలు చూపిన ప్రేమ మరియు నమ్మకం అఖండమైనది.“ ఈ మద్దతు కేవలం విజయం కాదు, సమగ్రతతో సేవ చేయడానికి మరియు తెలంగాణ లౌకికవాదం మరియు వృద్ధికి ఒక దీపస్తంభంగా ఉండేలా చూసుకోవడానికి ఒక పవిత్ర బాధ్యత. . సీఎం, టీపీసీసీ అధ్యక్షుడి కృషి ఫలితంగానే ఈ విజయాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు.

## దళిత యువకుడికి విముక్తి కల్పించిన సిఎంకి కృతజ్ఞతలు




సమావేశంలో మాట్లాడుతున్న సత్యరాజ్‌వర్మ. చిత్రంలో మహంకాళి రాంచందర్‌మాదిగ, కాంతమ్మ

**సైఫాబాద్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:** సిరిసిల్ల జిల్లా బోయినపెల్లి మండలం, బూర్లపెల్లి గ్రామానికి చెందిన దళిత యువకుడు కమటం వెంకటేశ్ సౌది అరెబియాలో జైలులో ఖైదీ జీవితం గడుపుతుంటే విముక్తి కల్పించడానికి సిఎం రేవంత్‌రెడ్డి తక్షణమే చర్యలు తీసుకుంటున్నదుకు రాష్ట్రంలోని 50 లక్షల మంది దళితులు పక్షాన సిఎంకు రాష్ట్ర ఎసీ, ఎస్టీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు తడిగొండ సత్యరాజ్‌వర్మ, తెలంగాణ మాదిగ దండోరా కార్యనిర్వాహక అధ్యక్షుడు మహంకాళీ రాంచందర్‌మాదిగ, వెంకటేశ్ తల్లి కాంతమ్మ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వెంకటేశ్ నకిలీ ఏజెంట్ ద్వారా సౌది అరెబియాలో ఉద్యోగం చేసేందుకు వెళ్లడం జరిగిందని, అక్కడ సరైన ఉద్యోగం లభించకపోవడంతో మద్యం అమ్మకం దందాలో పట్టుబడడంతో పోలీసులు అరెస్టు చేసి జైలులో పెట్టడం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురైనారని, ఈ విషయంపై సిఎంకి వినతి పత్రాన్ని అందజేశామని చెప్పారు. దీనికి వెంటనే స్పందించిన సిఎం కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ దృష్టికి, సౌది అరెబియా అంబాసిడర్ దృష్టికి తీసుకువెళ్లి విడిపిం చడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారని వారు తెలిపారు. భవి ష్యత్‌లో ఇలాంటి సంఘటనలకు యువత మోసపోకుండా ఉండేందుకు చైతన్య కార్యక్రమాలను నిర్వహిస్తామని వారు తెలిపారు.

## రంజాన్ మాసంలో మంచినీటి సమస్య లేకుండా చూడాలి



జలమండలి జనరల్ మేనేజర్ హరి శంకర్‌కు సమస్యలపై వినతిపత్రం అందజేస్తున్న మాజీ కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్.

**యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త**

రాబోయే పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని గాయిత్రి నగర్ అల్లాపూర్ డివిజన్ పరిధిలో ప్రజలకు సౌకర్యంగా ఉండేలా వాటర్ ట్యాంకర్లను ఏర్పాటు చేయాలని కోరుతూ జలమండలి జనరల్ మేనేజర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. మాజీ కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్ శుక్రవారం జలమండలి కార్యాలయంలో జనరల్ మేనేజర్‌ను కలిసి గాయిత్రినగర్, అల్లాపూర్ డివిజన్ పరిధిలో మజీద్‌లలో నమాజ్, ఇతర ప్రార్థనల కోసం పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవుతారని ప్రతి రోజూ ఉచిత వాటర్ ట్యాంకర్ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం మైనారిటీ సెల్ అధ్యక్షులు మహ్మద్ గౌసుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయంతో నేతల హర్షం



మహంకాళి ఆలయం వద్ద విజయోత్సవ సంబురాలు చేస్తున్న కాంగ్రెస్ నాయకుడు త్రికాల తదితరులు.

**బేగంపేట ఫిబ్రవరి 13,ప్రభాతవార్త**

రాష్ట్రంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడంపై సనత్‌నగర్ నియోజకవర్గం రాంగోపాల్‌పేట డివిజన్ లో కాంగ్రెస్ నాయకుడు త్రికాల మనోజ్ కుమార్ ముదిరాజ్ ఆధ్వర్యంలో విజయోత్సవ సంబురాలు నిర్వహించారు.శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి ఆలయం వద్ద కాంగ్రెస్ శ్రేణులు మిఠాయిలు తినిపించుకుని విజయోత్సవ సంబురాలు నిర్వహించారు.బాణా సంచా కాల్చి హర్షం వ్యక్తం చేసారు.కార్యక్రమంలో వినయ్,మాణిక్యం ప్రభు,అఖిల్, ఈశ్వర్, దుర్గయ్య,వెంకటేష్,సురేష్,సరిత,శీలం జయ,చందు,ఖాదర్, యాసీన్,అజార్,లాలాబాయి,శివ,శ్రీనివాస్,కార్తీక్ పాల్గొన్నారు.



బహదూర్‌పుర శివారులో ఉన్న నెహ్రూ జూలాజికల్ పార్కును ఇటీవల పదవీ బాధ్యతలు స్వీకరించిన తెలంగాణ రాష్ట్ర పిసిసిఎఫ్ వైల్డ్‌లైఫ్, చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ వినయ్ కుమార్ సందర్శించారు. జూ పార్కులోని అన్ని ఎన్‌క్లోజర్లనుఆయన తిలకించారు. జూ అధికారులు ఆయనకు జూపార్కులోని జంతువులు, పక్షులు, శానిటేషన్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జూపార్కు డైరెక్టర్ డాక్టర్ సునీల్ ఎస్ హీరామత్, జూపార్కు క్యూరేటర్ జె.వసంత పాల్గొన్నారు.

## నుమాయిష్‌లో జిహెచ్‌ఎంసికి ‘బెస్ట్ స్టాల్’అవార్డు

**-హర్షం వ్యక్తం చేసిన కమిషనర్ ఆర్ వి కర్ణన్**



ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న గోషామహాల్ ప్రాజెక్ట్ ఆఫీసర్ విజయలక్ష్మీ

**హైదరాబాద్, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:** నాంపల్లి నుమాయిష్-2026 ఎగ్జిబిషన్ లో జీహెచ్ఎంసీకి “బెస్ట్ స్టాల్” అవార్డు లభించింది. నుమాయిష్‌లో జీహెచ్ఎంసీ అర్బన్ కమ్యూనిటీ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్ లో 35 స్వయం సహాయక సంఘాలు తమ వస్తువులను ప్రదర్శన, అమ్మకం కు ఉంచాయి. ఇవన్నీ చేతితో తయారు చేసిన ఉత్పత్తులే కావడం విశేషం. వీటికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. నూమయుష్ కు విచ్చేసి వేలాదిమంది ప్రజలు ఈ స్టాల్ ను సందర్శించారు. జీహెచ్ఎంసీ కమిషనర్ పేరుతో నుమాయుష్ నిర్వాహకులు ప్రశంసా పత్రాన్ని అందించారు. గోషామహాల్ ప్రాజెక్ట్ ఆఫీసర్ విజయలక్ష్మి ప్రశంసా పత్రాన్ని, మెమెంటో ను స్వీకరించారు. జిహెచ్ఎంసికి బెస్ట్ స్టాల్ అవార్డు రావడం పట్ల కమిషనర్ ఆర్ వి కర్ణన్ హర్షం వ్యక్తం చేశారు. తమ ఉత్పత్తులు ప్రదర్శించిన స్వయం సహాయక సంఘాల సభ్యులకు, పట్టణ సామాజిక అభివృద్ధి అధికారులకు అభినందనలు తెలియజేశారు.

## స్వయం పరిపాలనతో విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు పెరుగుతాయి

**- మణికొండ మాజీ ఫ్లోర్ లీడర్ కొండకళ్ల రామకృష్ణారెడ్డి**



మణికొండ ప్రభుత్వ పాఠశాలలో జరిగిన స్వయం పరిపాలన దినోత్సవంలో పాల్గొన్న మాజీ ఫ్లోర్ లీడర్ కొండకళ్ల రామకృష్ణారెడ్డి.

**నార్సింగి, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త :** పాఠశాలల్లో నిర్వహించే స్వయం పరిపాలన దినోత్సవం వలన విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ పెరుగుతాయని మణికొండ మాజీ ఫ్లోర్ లీడర్ కొండకళ్ల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మణికొండ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు స్వయం పరిపాలన వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ వేడకకు ముఖ్య అతిథిగా విచ్చేసిన రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే మనలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెరిగేందుకు స్వయం పాలన వేడుకలు ఎంతో ఉపకరిస్తాయన్నారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తరగతి గదులకు వెళ్లి పాఠ్యాంశాలను బోధించడం వలన వారిలో సబ్జెక్టుపై పట్టు పెరుగుతుందన్నారు. కొందరు చదువుల్లో మరికొందరు ఆటల్లో ఇంకొందరు నాయకత్వంలో రాణించే అవకాశం ఉందని, ఇలాంటి వేడుకలు నిర్వహిస్తే విద్యార్థులలోని ప్రతిభ వెలుగు చూస్తుందన్నారు. ఈ వేడుకలు నిర్వహించిన ఉపాధ్యాయులకు ప్రత్యేక ధన్యావాదాలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దశరథ్ నాయక్, నాయకులు శ్రీరాములు, ఏర్పుల కుమార్, శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రంజాన్ ఏర్పాట్లపై అధికారులకు ఎమ్మెల్యే ముఠా గోపాల్ దిశానిర్దేశం



అడిక్ మెట్ డివిజన్ పరిధిలోని ఫాతిమా బేగం మసీదు వద్ద కమిటీ సభ్యులతో సమావేశమైన ఎమ్మెల్యే ముఠా గోపాల్

**చిక్కడపల్లి ఫిబ్రవరి 13, ప్రభాతవార్త :** పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ శుక్రవారం అడిక్ మెట్ డివిజన్ పరిధిలోని ఫాతిమా బేగం మసీదును సందర్శించారు. మసీద్ కమిటీ అధ్యక్షుడు మొహమ్మద్ జహంగీర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో కమిటీ సభ్యులు ఖాసిం, ఖైజర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మొహమ్మద్ ఖదీర్, నేత శ్రీను, గౌస్ , ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రార్థనలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా మసీదు పరిసరాల్లో వీధి దీపాలు, నిరంతర నీటి సరఫరా, పారిశుధ్య పనులు వంటి సమస్యలను తక్షణమే పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. ప్రజా సమస్యలకు సంబంధించి స్థానికంగా ఉన్న పెండింగ్ సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని, దీంతో పాటు శాంతిభద్రతలకు సంబంధించి రంజాన్ మాసంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కోరారు.

## ఆస్మాన్ ఘాడ్ డివిజన్‌ను ఎస్సీ రిజర్వ్ చేయాలి: రమేష్ మాదిగ



జిహెచ్ఎంసి కమిషనర్ కర్ణన్ కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు రమేష్ మాదిగ,శ్యామ్, నందు, ధర్మేందర్, నరసింహ తదితరులు

**మలక్ పేట, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో డివిజన్ల పునర్విభజనలో భాగంగా నూతన డివిజన్ గా ఏర్పడిన ఆస్మాన్ ఘాడ్ డివిజన్ ను ఎస్సీ రిజర్వ్ చేయాలని బీఎస్పీ నాయకులు రమేష్ మాదిగ పేర్కొన్నారు. ఈ మేరకు బిఎస్పి నాయకులు రమేష్ మాదిగ, కే శ్యామ్, బిఆర్ఎస్ నాయకులు నందు, కాంగ్రెస్ నాయకులు ధర్మేందర్, ఎంఐఎం నాయకులు నరసింహ తదితర ప్రతినిధుల బృందం గ్రేటర్ హైదరాబాద్ జిహెచ్ఎంసి కమిషనర్ కర్ణన్ ను కలిసి మలక్ పేట నియోజకవర్గం పరిధిలో నూతన డివిజన్ గా ఏర్పడిన ఆస్మాన్ ఘాడ్ డివిజన్ ను ఎస్సీలకు రిజర్వ్ చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మలక్ పేట్ నియోజకవర్గం లోని ఆస్మాన్ ఘాడ్ డివిజన్ ను ఎస్సీ లకు రిజర్వ్ చేయాలని కోరడం జరిగిందని వివరించారు. స్వతంత్రం వచ్చిన తర్వాత మలక్ పేట్ నియోజకవర్గంలో ఒక్క డివిజన్ కూడా ఎస్సి రిజర్వ్ కాలేదని, మలక్ పేట నియోజకవర్గంలో నూతనంగా ఏర్పడిన ఆస్మాన్ ఘాడ్ డివిజన్‌ను ఎస్సీలకు రిజర్వ్ చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గోపాల్, వెంకటస్వామి, శ్రీరామ్,నరహరి పాల్గొన్నారు.

## స్టీల్ బ్రిడ్జి నిర్మాణం పనులను త్వరగా పూర్తి చేయాలి : ఎమ్మెల్యే బలాల



సైదాబాద్ వై జంక్షన్ వద్ద స్టీల్ బ్రిడ్జి నిర్మాణం పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల, చిత్రంలో డిప్యూటీ కమిషనర్ ఇంకేషాఫ్ అలీ , ట్రాఫిక్ ఏసిపి చంద్రకుమార్ తదితరులు

**మలక్ పేట, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:** మలక్ పేట స్టీల్ బ్రిడ్జి నిర్మాణం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మలక్ పేట నియోజకవర్గం ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. మలక్ పేట నుంచి సంతోష్ నగర్ చౌరస్తా వరకు నిర్మించనున్న స్టీల్ బ్రిడ్జి నిర్మాణం పనులను ఎమ్మెల్యే అహ్మద్ బలాల వివిధ శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలాల మాట్లాడుతూ రానున్న రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా సైదాబాద్ వై జంక్షన్ వద్ద మూసివేసిన రోడ్డును మరల తెరవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఇంకేషాఫ్ అలీ, ట్రాఫిక్ ఏసిపి చంద్రకుమార్ పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ పేదలపాలిటి వరం : ఎమ్మెల్యే



బాధితుడు రవికుమార్ కు సిఎం రిలీఫ్ ఫండ్ ఎల్‌ఓసిని అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి.

**వనస్థలిపురం. ఫిబ్రవరి.13.ప్రభాతవార్త.** సీఎం రిలీఫ్ ఫండ్‌తో ఎంతో మంది పేదలకు లబ్ది చేరుకుతుందని ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుదీర్ రెడ్డి పేర్కొన్నారు. వనస్థలిపురం డివిజన్ పరిధిలోని గుంటి జంగయ్య నగర్ నందు నివాసం ఉండే రవికుమార్‌కి మంజూరైన లక్షల రూపాయల సిఎం సహాయనిధి చెక్కును ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుదీర్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా సుదీర్ రెడ్డి మాట్లాడుతూ.. పేదల ఆరోగ్య పరిరక్షణకు సీ.యం.సహాయనిధి దోహదపడుతుంది అని అన్నారు.ఈ పథకం పేదలకు ఓ వరం లాంటిది అని అన్నారు.పేద ప్రజలకు నాణ్యమైన అధునాతన వైద్య సేవలను పొందేందుకు సీ.ఎం.సహాయనిది అండగా ఉంటుంది అని అన్నారు.కార్యక్రమంలో ప్రభాకర్ రెడ్డి గారు పాల్గొన్నారు.

## దుర్గా పోచమ్మ దేవాలయ కమాన్ నిర్మాణానికి భూమిపూజ



పూజా కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మేయర్ బండ కార్తిక చంద్రారెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి తధితరులు

**తార్నాక, జనవరి 13 ప్రభాతవార్త :** తార్నాక స్ట్రీట్ నెంబర్ 10లోని శ్రీ దుర్గా పోచమ్మ దేవాలయానికి నూతనంగా చేపట్టిన కమాన్ నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, మాజీ మేయర్ బండ కార్తీక చంద్రారెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవుని దయతో ఈ పవిత్ర స్థలానికి పునాది రాయి వేయడం ఎంతో ప్రత్యేకమైన సందర్భంగా భావిస్తున్నామని తెలిపారు. భక్తుల ఐక్యత, విశ్వాసం, భక్తి భావం ఈ ఆలయ నిర్మాణానికి మరింత బలాన్ని ఇస్తాయని పేర్కొన్నారు.తార్నాక ప్రజలందరిని అమ్మవారు చల్లగా చూడాలని ప్రార్థిస్తూ, అమ్మవారి ఆశీస్సులు అందరికీ ఉండాలని ఆకాంక్షించారు. అమ్మవారి కృపతో కమాన్ నిర్మాణం త్వరితగతిన పూర్తి కావాలని, ఆలయ అభివృద్ధి పనులు మరింత వేగంగా కొనసాగాలని అన్నారు.ఈ కార్యక్రమంలో తార్నాక వాసులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## త్వరలో అజ్మత్‌నగర్ కల్వర్టు పనులు పూర్తి : బన్నాల గీత



అజ్మత్‌నగర్ కల్వర్టు పనులు పరిశీలిస్తున్న మాజీ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ తదితరులు

**ఉప్పల్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త :** రూ.కోటి వ్యయంతో చేపట్టిన అజ్మత్ నగర్ కల్వర్టు పనులు త్వరలోనే పూర్తి చేస్తామని మాజీ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం అజ్మత్ నగర్ కల్వర్టు పనులను ఆమె పరిశీలించారు. కల్వర్టు పనులు శరవేగంగా సాగుతున్నాయని, కల్వర్టుపై శుక్రవారం స్లాబు వేసినట్లు తెలిపారు. పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకుని రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నేత బన్నాల ప్రవీణ్, అజ్మత్ నగర్ కాలనీ అధ్యక్షులు అతిశేష రాదంజోడ్, విశతాత్ ఎన్‌క్లేవ్ కాలనీ అధ్యక్షులు అమరేందర్‌రెడ్డి, సభ్యులు గోపాలరావు, సునీల్ ,ప్రకాష్, పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత : ట్రాఫిక్ ఎసిపి చంద్రకుమార్



ట్రాఫిక్ నియమ, నిబంధనాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఏసిపి చంద్రకుమార్, చిత్రంలో ఇన్ స్పెక్టర్లు నాగుల అశోక్, సత్యనారాయణ తదితరులు

**మలక్ పేట, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత అని చాంద్రాయణగుట్ట జోన్ ట్రాఫిక్ ఏసిపి వి.చంద్రకుమార్ పేర్కొన్నారు. హైదరాబాద్ కమీషనర్ వి. సి. సజ్జనార్, ట్రాఫిక్ జాయింట్ సి.పి జోయల్ డేవిస్ అధికారుల ఆదేశాల మేరకు బేగంపేట టిటిఐ ఇన్ స్పెక్టర్ నాగుల అశోక్, మలక్ పేట, సైదాబాద్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల ఆధ్వర్యంలో ముసారం బాగ్ జంక్షన్ వద్ద వాహనదారులకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమ, నిబంధనల గురించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏసీపీ చంద్రకుమార్ మాట్లాడుతూ రోడ్డు పై మన భద్రతతో పాటు ఇతరుల భద్రత కోసం ట్రాఫిక్ నియమ, నిబంధనలను పాటించాల్సిన ఆవశ్యకత గురించి వివరించారు. హెల్మెట్ , సీట్ బెల్ట్ వాడకం, జీబ్రా క్రాసింగ్ల వినియోగం యొక్క ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. హెల్మెట్ ధరించని రైడర్, పిలియన్ రైడర్ కు పుష్ప గుచ్ఛాలు, చాక్లెట్స్ అందజేసి ట్రాఫిక్ నియమ, నిబంధనల గురించి అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు వాహనం నడిపేటప్పుడు రైడర్, పిలియన్ రైడర్ హెల్మెట్ ధరించాలని సూచించారు. ప్రమాదాలు ఉచితం కానీ అవయవాలు ఉచితం కాదని తెలియజేశారు.బేగంపేట టిటిఐ ఇన్ స్పెక్టర్ నాగుల అశోక్ మాట్లాడుతూ వాహన చోదకులకు రోడ్డు ప్రమాదాలు జరగకుండా విలువైన మానవ ప్రాణాలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను ఖచ్చితంగా పాటించాలని కోరారు. మద్యం సేవించి వాహనం నడపడం, మొబైల్ ఫోన్ వినియోగం, రాంగ్ రూట్ డ్రైవింగ్, రెడ్ సిగ్నల్ జంపింగ్, అతి వేగం, ట్రిపుల్ రైడింగ్ వలన కలిగే ప్రమాదాల గురించి, పాదచారులు జీబ్రా లైన్స్ ఉపయోగించడం వలన కలిగే లాభాల గురించి వివరించారు. ఈకార్యక్రమంలో సైదాబాద్ ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ ఎం సత్యనారాయణ, మలక్ పేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్.ఐ. నర్మద, రాజు, సిబ్బంది లీగల్ టీం, టి.టి.ఐ. బేగంపేట్ సిబ్బంది సాయికుమార్, కృష్ణ పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికతతో ప్రశాంతత-దేవాలయం అభివృద్ధికి సహకారం : మహిళా కమిషన్ చైర్మన్ నేరెళ్ల శారద



ఐఎస్ఓ సర్టిఫికెట్ అందజేస్తున్న చైర్మన్ నేరెళ్ల శారద, శివయ్య

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:** ఆధ్యాత్మికత ద్వారానే ప్రశాంత వాతావరణ నెలకొంటుందని, దేవాలయ అభివృద్ధికి తన వంతు సహకారాన్ని అందిస్తానని మహిళా కమిషన్ చైర్మన్ నేరెళ్ల శారద పేర్కొన్నారు. ఆర్కేపురం డివిజన్ వాసవికాలనీలోని అష్టలక్ష్మి దేవాలయంలో మూడు దశాబ్దాలు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు, ఆధ్యాత్మిక సేవలు, నిర్వహణ ప్రమాణాలు, పారదర్శకతకు గుర్తింపునిస్తూ అష్టలక్ష్మి దేవాలయానికి హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ద్వారా ఐఎస్ఓ 9001:2015 సర్టిఫికేట్ ప్రధాన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ సంస్థ ఎండి శివయ్య నేతృత్వంలో మహిళా కమిషన్ చైర్మన్ నేరెళ్ల శారద చేతుల మీదుగా దేవాలయం ఫౌండర్ చైర్మన్ గౌరిశెట్టి చంద్రశేఖర్‌గుప్తా, చైర్మన్ సోమ సురేష్‌కుమార్‌లకు సర్టిఫికెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేవాలయం నిర్వాహకులు, పురోహితులు క్రమశిక్షణతో దేవాలయాన్ని అభివృద్ధి చేసి భక్తులకు కావలసిన మౌలిక వసతులను కల్పించడం పట్ల అభినందనలు తెలియజేశారు. అష్టలక్ష్మి అమ్మవారికి సేవ చేసుకునే భాగ్యాన్ని తనకు కూడా కల్పించాలని విజ్ఞప్తి చేస్తూ దేవాలయం అభివృద్ధికి తన పూర్తి సహాయసహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. విక్టోరియా మెమోరియల్ మెట్రో స్టేషన్ పేరును అష్టలక్ష్మి దేవాలయం పేరుగా మార్చడానికి ప్రతిపాదనలు పంపించామని త్వరలోనే పేరు మార్పిడి జరుగుతుందన్నారు. దేవాలయానికి విశిష్టమైన గుర్తింపు ఇవ్వడం మూడు దశాబ్దాలుగా నిర్వహిస్తున్న సేవాకార్యక్రమాలు, ఆధ్యాత్మిక సేవలు, నిర్వహణ ప్రమాణాలు, పారదర్శకతకు చిహ్నం అన్నారు. దేవాలయ అభివృద్ధికి తోడ్పడిన మహారాజు పోషకులు, దాతలు, కమిటీ సభ్యులు, భక్తుల సమిష్టి కృషికి లభించిన ఫలితమని అన్నారు. ఈ సందర్భంగా శారద దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం నిర్వాహకులు ఆమెను ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో దేవాలయం కోశాధికారి ఐత అంజయ్యగుప్తా, కార్యదర్శి గంప జగన్,కార్యదశి దాసేపల్లి శ్రీనివాస్,చిలక మధురఉపేందర్‌రెడ్డి, తమ్మన శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# సిఎం రేవంత్‌రెడ్డికి మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి లేఖ

**-కార్పొరేషన్ల విభజనపై హేతుబద్ధతను ప్రశ్నించిన మాజీ మంత్రి**

**-ప్రభుత్వం పునః పరిశీలించాలని వినతి**

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:** హైదరాబాద్ చుట్టూ ఉన్న మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలను విలీనం చేయడం ద్వారా కొత్త, పాత కలిపి పునర్వవస్థీకరించిన మూడు వందల డివిజన్లతో కూడిన గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను మూడు భాగాలుగా (జిహెచ్ఎంసి, సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్లుగా) విభజించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరించంపై తెలంగాణ రాష్ట్రంలో మొట్టమొదటి మహిళా మంత్రి (ప్రస్తుత మాజీ మంత్రి), మహేశ్వరం ఎమ్మెల్యే, టిఆర్ఎస్ శాసనసభా పక్ష ఉప నాయకురాలు పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆమె రాష్ట్ర ముఖ్యమంత్రికి లేఖ రాశారు. లేఖ పూర్తిగా ఈ విధంగా ఉంది. గౌరవనీయులైన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారికి....

విషయం: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి) ని మూడు భాగాలుగా విభజించడంలో హేతుబద్ధత లేకపోవడం, ప్రజాప్రతినిధులతో సంప్రదింపులు లేకుండా తీసుకున్న ఏకపక్ష నిర్ణయంపై అభ్యంతరం తెలియజేయుట గురించి..నమస్కారాలతో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి) పరిధిని మూడు వేర్వేరు మున్సిపల్ కార్పొరేషన్లుగా విభజిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని పరిశీలించినప్పుడు ఈ నిర్ణయంపై స్పష్టమైన హేతుబద్ధత లేకుండా ఏ విధమైన ప్రాతిపదికను వెల్లడించకుడా ప్రజాస్వామ్య సాంప్రదాయాలకు విరుద్ధంగా తీసుకున్నదిగా స్పష్టమవుతున్నది. ఇంత కీలకమైన పరిపాలనా మార్పును గ్రేటర్ పరిధిలోని స్థానిక ప్రజాప్రతినిధులతో ఎలాంటి సంప్రదింపులు జరపకుండానే ఏకపక్షంగా ప్రకటించడం తీవ్రంగా ఖండనీయమైన విషయం.రాజేంద్రనగర్, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల్లోని పట్టణ ప్రాంత్రాలను రెండు వేర్వేరు కార్పొరేషన్లలో చేర్చడం వెనుక ప్రభుత్వ ఉద్దేశ్యమేమిటో స్పష్టత లేదు. సైబరాబాద్ కార్పొరేషన్‌కు అత్యంత సమీపంలో ఉన్న బండ్లగూడ, రాజేంద్రనగర్, శంషాబాద్ వంటి ప్రాంతాలను జిహెచ్ఎంసి పరిధిలో చేర్చడం ఎందుకు జరిగింది? అలాగే మల్కాజిగిరి కార్పొరేషన్‌కు పక్కనే ఉన్న బడంగ్‌పేట్, తుక్కుగూడ, మీర్‌పేట్ ప్రాంతాలను జిహెచ్ఎంసి పరిధిల ఉంచడం వెనుక ఉన్న హేతుబద్ధత ఏమిటి? ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని తుర్కయాంజాల్ ప్రాంతాన్ని మల్కాజిగిరిలో చేర్చకుండా జిహెచ్ఎంసిలో కలపడం ఏ విధమైన ప్రమాణాల ఆధారంగా జరిగింది? ఈ విభజన భౌగోళిక, పరిపాలన,జనాభా ప్రమాణాలను ఏమైనా పరిగణలోకి తీసుకున్నారా? లేక పూర్తిగా ఇష్టానుసార నిర్ణయాలేనా? అనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

జిహెచ్ఎంసిని మూడు భాగాలుగా విభజించాలంటే సమతుల్యంగా న్యాయంగా చేయాల్సిన అవసరం ఉంది. అయితే కొత్త జిహెచ్ఎంసిలో 150 డివిజనుల, సైబరాబాద్ కార్పొరేషన్‌లో 76 డివిజన్లు, మల్కాజిరిగి కార్పొరేషన్‌లో 74 డివిజన్లు ఉండడం ద్వారా ఈ విభజన ఎంత అసమతుల్యంగా ఉందో స్పష్టంగా తెలుస్తోంది. ఈ అసమాన విభజన వెనుక రాజకీయ ఆంతర్యం ఏదైనా ఉందా అనే అనుమానాలు సహజంగా తలెత్తుతున్నాయి. రంగారెడ్డి జిల్లా పరిపాలనా స్థిరత్వం దెబ్బతింటోందని ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో శివారు మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలను జిహెచ్ఎంసిలో విలీనం చేస్తూ తీసుకున్న నిర్ణయాల వల్ల ప్రజలు ఇప్పటికీ అనేక మార్పులకు లోనయ్యారు. ఇప్పుడు తిరిగి వాటిని విడదీయడం ద్వారా ప్రజల్లో గందరగోళం, అయోమయం ఏర్పడుతోంది. ఇది అనాలోచిత నిర్ణయమే కాకుండా ప్రజలపై అనవసరమైన పరిపాలనా భారాన్ని మోపే చర్యగా మారుతోంది. అంతే కాకుండా గత అసెంబ్లీ సమావేశంలో శివారు మున్సిపాలిటీలను జిహెచ్ఎంసిలో విలీనం చేసే ఉద్దేశ్యం ప్రభుత్వానికి లేదని సంబంధిత మంత్రులు నిండు సభలో స్పష్టంగా ప్రకటించారు. అలాంటి హామీలను విస్మరించి ఇప్పుడు పూర్తి విరుద్ధ నిర్ణయం తీసుకోవడం శాసనసభకు, ప్రజాస్వామ్య వ్య వస్థకు భంగం కలిగించే చర్యగా భావించాల్సి వస్తోంది. జిహెచ్ఎంసి సమావేశంలో శాసనసభా నియోజకవర్గాల పరిధిలోనే డివిజన్ల విభజ న ఉంటుందని అధికారులు స్పష్టం చేసినప్పటికీ ఆ హామీలకు విరు ద్ధంగా రెండు నియోజకవర్గాల్లోని ప్రాంతాలను కలుపుతూ డివిజన్లను ఏర్పాటు చేయడం వెనుక ఉన్న హేతుబద్ధత అర్థం కావడం లేదు. జిహెచ్ఎంసి సమావేశాల్లో ప్రజాప్రతినిధులు లేవనెత్తిన అభ్యంతరా లు, సూచనలు పూర్తిగా విస్మరించి ప్రభుత్వం ఇష్టారాజ్యంగా ఈ విభజన నిర్ణయం తీసుకోవడం తీవ్ర అభ్యంతరకర విషయం. కావున ఈ విభజన నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే పునః పరిశీలించాలి. స్పష్టమైన ప్రమాణాలు, హేతుబద్ధతతో కూడిన సమతుల్య విభజన మాత్రమే చేపట్టాలని ప్రజల తరపున బలంగా డిమాండ్ వినిపిస్తున్నా ను. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజలపై పరిపాలనా భారాన్ని మోపే నిర్ణయాలను విరమించుకొని ప్రజాస్వామ్య పద్ధతిలో ముం దుకు సాగుతుందని ఆశిస్తున్నాను.

## పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు బాధితులకు అందజేత



బాధితులకు సెల్ ఫోన్లను అందజేస్తున్న ఏసీపీ సుబ్బరామిరెడ్డి, చాదర్ ఘాట్ ఇన్ స్పెక్టర్ కాసాని బ్రహ్మ మురారి తదితరులు

**మలక్ పేట, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:** చోరీ, పడిపోవడం, మిస్సింగ్ వంటి కారణాలతో పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు తిరిగి దొరకడం అసాధ్యమనే భావనలో ఉన్న బాధితులకు తిరిగి సెల్ ఫోన్లను అందజేసి చాదర్ ఘాట్ పోలీసులు భరోసా కల్పించారు. ఆధునిక సాంకేతికత పరిజ్ఞానాన్ని ఉపయోగించి సీఈఐఆర్ (సెంట్రల్ ఇక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) పోర్టల్ ద్వారా పోగొట్టుకున్న 10 సెల్‌ఫోన్లను గుర్తించి బాధితులకు చాదర్ ఘాట్ పోలీస్ స్టేషన్లో జరిగిన కార్యక్రమంలో మలక్ పేట ఎసిపి సుబ్బరామిరెడ్డి, చాదర్ ఘాట్ ఇన్ స్పెక్టర్ కాసాని బ్రహ్మ మురారిలు తిరిగి అప్పగించారు.ఈ సందర్భంగా మలక్‌పేట ఏసీపీ సుబ్బిరామిరెడ్డి రెడ్డి మాట్లాడుతూ.. సెల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితులు సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయడం ద్వారా ఫోన్‌ను బ్లాక్ చేయడంతో పాటు, తిరిగి రికవరీ అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. బాధితుల ఫిర్యాదుల ఆధారంగా చాదర్ ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఫోన్లను ట్రాక్ చేసి స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ కాసాని బ్రహ్మ మురారి మాట్లాడుతూ టెలికమ్యూనికేషన్ శాఖ అందుబాటులోకి తెచ్చిన సీఈఐఆర్ పోర్టల్ మే 17, 2023 నుంచి విజయవంతంగా పనిచేస్తోందని తెలిపారు. సెల్‌ఫోన్ పోయిన వెంటనే బాధితులుసీఈఐఆర్ పోర్టల్,ఎన్‌సీఆర్‌పీ పోర్టల్, 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని సూచించారు. ఈ విధంగా ఫిర్యాదు చేయడంతో ఫోన్ దుర్వినియోగాన్ని అడ్డుకోవడంతో పాటు, తిరిగి దొరికే అవకాశం ఉంటుందని తెలిపారు. ఫోన్లు తిరిగి దక్కడంతో బాధితులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో డిఐ శ్రీనివాసరావు, ఎస్ఐలు, సురేష్ రెడ్డి, భరత్, ఎలా కృష్ణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అత్యధిక మున్సిపాలిటీలను కైవసం చేసుకోవడంపై హర్షం వ్యక్తం చేస్తూ గాంధీభవన్‌లో జరిగిన సంబరాల్లో విహెచ్‌కు మిఠాయి తినిపిస్తున్న బాలాపూర్ డివిజన్ కాంగ్రెస్ నేత బాల్‌నింగని జంగయ్య

## రోడ్ల విస్తరణపై ప్రత్యేక దృష్టి

**-జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి**

**-నీరు నిలిచే చౌరస్తాలను పరిశీలించిన అధికారులు**



**అత్తాపూర్ ఫిబ్రవరి13,ప్రభాతవార్త :** ప్రధాన ట్రాఫిక్ కూడలిల్లో రద్దీని తగ్గించడానికి భద్రతను మెరుగుపరచడానికి,రోడ్లు విస్తరణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి పేర్కొన్నారు. శుక్రవారం రాజేంద్రనగర్ జోన్ పరిధిలోని ఆరాంఘర్ జంక్షన్,డైరీ ఫార్మ్ ,పిడిపి చౌరస్తాల వద్ద వర్షం నీరు నిలిచే ప్రదేశాలను ట్రాఫిక్ డిప్యూటీ కమిషనర్ రాహుల్ హెడ్గెతో కలిసి జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి సందర్శించారు.ఈ సందర్భంగా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రోడ్డు విస్తరణ,పలు అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించారు. పెరుగుతున్న ట్రాఫిక్‌కు అనుగుణంగా మౌలిక సదు పాయాలు ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను పరిశీలించారు.ఈ సందర్భంగా జెడిసి అనురాగ్ జయంతి మాట్లాడుతూ.. .రామ్‌దేవ్ బాబు వాటర్‌లాగింగ్ పాయింట్ వద్ద అవుట్‌లెట్ పైపు నీటి పరిమాణం పెరుగుదల కోసం చర్యలు తీసుకోవడంతో పాటు శివరాంపల్లి డౌన్ ర్యాంప్ నుండి ఆర్‌జెఎన్‌ఆర్ ట్రాఫిక్ పిఎస్ వరకు ఫ్రీ లెఫ్ట్ అభివృద్ధి మరియు రహదారి విస్తరణ పనులు, బాబుల్‌రెడ్డి నగర్‌లోని ఎన్‌పిఎ స్కూల్‌లో ఎఫ్ఓబి నిర్మాణం, మన్మోహన్ సింగ్ ఫ్లైఓవర్ నుండి అరాంఘర్ వరకు రహదారి విస్తరణ మరియు ఫుట్‌పాత్ ఏర్పాటు చేయనున్నట్లు ఎలిపారు.పాదచారుల క్రాసింగ్‌లను తగ్గించడానికి మన్మోహన్ సింగ్ ఫ్లైఓవర్ నుండి అరాంఘర్ వరకు సెంట్రల్ మీడియన్ రైలింగ్ ఏర్పాటుతో పాటు సురక్షితమైన హోల్డింగ్ మరియు క్రాసింగ్ కోసం పాదచారుల ద్వీపాల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ట్రాఫిక్ సిఐ రాజు,ఎఈ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## నాచారం శాంతి గార్డెన్‌లో ఘనంగా వెంకటేశ్వర స్వామి కళ్యాణం



ప్రత్యేక పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే బిఎల్ఆర్, సాయిజన్ శేఖర్

**నాచారం, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త :** నాచారం పరిధిలోని శాంతి గార్డెన్ లో రమేష్-లక్ష్మీ దంపతులు తమ నివాసంలో శుక్రవారం నిర్వహించిన శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీనివాసుని కృప ఉప్పల్ ప్రజలందరిపై సదా ఉండాలని కోరుకుంటున్నానని తెలిపారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందించడమే కాకుండా శాంతి, సౌభ్రాతృత్వాలకు దోహదపడతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మనోజ్, లక్ష్మణ్, బీఆర్ఎస్ నాయకులు సాయి జెన్ శేఖర్, విఠల్ యాదవ్, కట్ట బుచ్చన్న గౌడ్, చంద్రశేఖర్, ఎర్రం శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్, నికిల్, రోహిత్, వాసు, కిట్టు తదితరులు పాల్గొన్నారు.

# మల్కాజ్గిరి కార్పొరేషన్‌లో ఎల్బీనగర్ జోన్



సర్కిల్ కార్యాలయాల పేర్లతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన దృశ్యం

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:** మల్కాజిగిరి కార్పొరేషన్ పరిధిలోకి ఎల్బీనగర్ జోన్ వచ్చింది. జిహెచ్ఎంసి నుంచి ప్రభుత్వం నూతనంగా ఏర్పాటుచేసిన మల్కాజ్గిరి కార్పొరేషన్‌లోకి ఎల్బీనగర్ జోన్ వెళ్ళింది. నూతన కార్పొరేషన్‌లోకి వెళ్లడంతో సరూర్‌నగర్, ఎల్బీనగర్, హయాత్ నగర్ సర్కిల్ కార్యాలయాల పేర్లతో ఫ్లెక్సీలను కూడా అధికారులు ఏర్పాటు చేశారు. ఎల్బీనగర్ జోన్ పరిధిలో నాగోల్, సరూర్‌నగర్, ఎల్బీనగర్, హయాత్‌నగర్ సర్కిల్లలోని 24 డివిజన్లు వస్తాయి. నాగోల్ సర్కిల్ పరిధిలో నాగోల్, మన్సురాబద్, జిఎస్ఐ, లెక్చరర్స్‌కాలనీ, కుంట్లూరు, పెద్దఅంబర్పేట, సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలో కొత్తపేట, చైతన్యపురి, గడ్డిఅన్నారం, సరూర్నగర్, డాక్టర్స్‌కాలనీ, ఆర్కేపురం, ఎన్టీఆర్ నగర్, ఎల్బీనగర్ సర్కిల్ పరిధిలో లింగోజిగూడ, చెంపాపేట, కర్మాన్‌ఘాట్, బైరామల్‌గూడ, హస్తినాపురం, హయత్‌నగర్ సర్కిల్ పరిధిలో బిఎన్.రెడ్డినగర్, వనస్థలిపురం, చింతలకుంట హైకోర్టుకాలనీ, సాహెబ్‌నగర్, హయాత్‌నగర్ డివిజన్లను ఏర్పాటు చేశారు.

## వెంకట్‌రెడ్డినగర్‌లో విద్యుత్‌శాఖ అధికారుల బస్తీబాట



వెంకట్‌రెడ్డినగర్‌లో బస్తీబాటలో పాల్గొన్న విద్యుత్‌శాఖ ఎడిఇ రవీందర్, అకారపు అరుణ్ తదితరులు

**రామంతాపూర్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త :** రామంంతాపూర్ వెంకట్‌రెడ్డినగర్‌లో శుక్రవారం విద్యుత్ శాఖ అధికారులు బస్తీబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అకారపు అరుణ్ పటేల్ అధికారులతో కలిసి పలు ప్రాంతాల్లో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.డివిజన్ పరిధిలోని వెంకట్ రెడ్డి నగర్, శ్రీనివాసపురం, మధుకానగర్, వాసవి నగర్ కాలనీలో పర్యటించి పలు సమస్యలు పరిశీలించారు. ఇటీవల జరిగిన అగ్ని ప్రమాద సంఘటనను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. పలు చోట్ల కొత్త విద్యుత్ స్థంభాలతోపాటు, సింగిల్ పేజ్ ఉన్న ప్రాంతంలో త్రీ పేజ్ ఏర్పాటు చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి సహకారంతో డివిజన్‌లో విద్యుత్ సమస్యలు పూర్తి స్థాయిలో పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం తమ వంతు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎడిఇ రవీందర్, ఎఇ లావణ్య ఇతర అధికారులు, పాల్గొన్నారు.

## బీరప్పగడ్డలో దోమల నివారణకు ప్రత్యేక ఫాగింగ్ : ఎంపిఆర్



బీరప్పగడ్డలో దోమల నివారణకు ఫాగింగ్ యంత్రాన్ని ప్రారంభిస్తున్న కాంగ్రెస్ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి, ఇర్షాద్‌ఖాన్ తదితరులు

**ఉప్పల్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త :** బీరప్పగడ్డ వార్డులో దోమల నివారణకు ప్రత్యేకంగా ఫాగింగ్ యంత్రం ఏర్పాటు చేసిన ఇర్షాద్ ఖాన్‌ను కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా రాత్రి ప్రత్యేక ఫాగింగ్ యంత్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలు గుర్తించి వాటి పరిష్కారానికి స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయమన్నారు ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని చేపట్టిన ప్రత్యేక ఫాగింగ్ స్థానిక ప్రజల నుండి విశేష ఆదరణ పొందుతుందన్నారు. ప్రజా సంక్షేమం కోసం మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ నేత ఇర్షాద్‌ఖాన్ మాట్లాడుతూ బీరప్పగడ్డ డివిజన్ కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ ఇంచార్జీ ఆకిటి ఆగంరెడ్డి, స్థానిక నేతలు పవన్ గౌడ్, దత్తు, జయమ్మ, అనిత, అనుష, గోరమ్మ, శరత్, అజీమ్, జునైద్, యాసీన్, అల్తాఫ్, ఆమర్, ఫహీమ్, అఫ్జల్, మొహ్సిన్, ఆసిఫ్, కిట్టు, శశి, సాయి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లెలగూడ కమలానగర్‌లో శివదీక్ష స్వాములు ఇరుముడి కార్యక్రమం



శివదీక్ష స్వాములను సన్మానించి జ్ఞాపికలను అందజేసిన మాజీ కార్పొరేటర్ ఎనుగుల అనిల్‌కుమార్ యాదవ్

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ సర్కిల్‌లోని జిల్లెలగూడ కమలానగర్ కాలనీలోనున్న శ్రీ ముత్యాలమ్మ, శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో శుక్రవారం శివ దీక్ష స్వాముల జ్యోతి ఇరుముడి కార్యక్రమం ఘనంగా జరిగింది. శంకర్ గురుస్వామి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం సందర్భంగా కఠోర శివదీక్షలు పాటించిన స్వాములు భక్తి శ్రద్ధలతో ఇరుముడి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పడి వెలిగించిన తర్వాత వారందరికీ ఇరుముడులు కట్టారు. అయితే ఈ కార్యక్రమానికి హాజరైన మాజీ కార్పొరేటర్ ఎనుగుల అనిల్‌కుమార్ యాదవ్ శివదీక్ష స్వాములందరినీ శాలువాలతో సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక దేవాలయ చైర్మన్ బొమ్మకంటి దయానంద్ ముదిరాజ్, జిల్లెలగూడ వెంకటేశ్వర స్వామి దేవాలయ మాజీ ధర్మకర్త బొమ్మరబోయిన యాదగిరి ముదిరాజ్ గురుస్వామి, మెరుగు సత్తయ్య, మహేష్ గురుస్వామి, వెంకటేష్ ముదిరాజ్, భీమరాజు బిక్షపతి, గంట రామకృష్ణ సాయం శ్రీకాంత్, భూతరాజు చందులతో పాటు పలువురు స్వాములు పాల్గొన్నారు.

## ఉప్పల్ సర్కిల్‌లో చెరువులకు మహర్దశ : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



రామంతాపూర్ చిన్న చెరువు అభివృద్ధి చేయాలని హైడ్రా కమిషనర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, గంధం నాగేశ్వర్‌రావు తదితరులు

**ఉప్పల్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త :** ఉప్పల్ సర్కిల్ పరిధిలోని పెద్ద చెరువు, రామంతాపూర్ చిన్న చెరువు, కాప్రా చెరువులను అభివృద్ధి చేసేందుకు హైడ్రా ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసిందని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నేతలు బన్నాల ప్రవీణ్, సాయిజెన్ శేఖర్, గందం నాగేశ్వర్‌రావు, భూపాల్‌రెడ్డి, బైరి నవీన్‌గౌడ్ తదితరుల ఆధ్వర్యంలో హైడ్రా కమిషనర్ ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలోని కాప్రా చెరువు అభివృద్ధికి రూ.35 కోట్లు, ఉప్పల్ పెద్ద చెరువు అభివృద్ధికి రూ.30 కోట్లు, రామంతాపూర్ చెరువు సుందరీకరణకు రూ.19 కోట్ల నిధులు మంజూరు చేశారని తెలిపారు. కాప్రా చెరువు సుందరీకరణ చేయడం తోపాటు అభివృద్ధి చేస్తారని తెలిపారు. ఉప్పల్ పెద్ద చెరువును రూ.30 కోట్లతో సుందరీకరణ చేస్తారని, గుర్రపు డెక్క పూర్తి తొలగిస్తారని తెలిపారు. దోమల సమస్య కొంత వరకు తీరుందన్నారు. దీంతోపాటు హెచ్ఎంటి కాలనీ నుంచి హైకో ర్టు కాలనీకి రహదారి నిర్మిస్తామని తెలిపారు. హైడ్రా ఆధ్వర్యంలో చెరువుల సుందరీకరణ జరుగుతుందని తెలిపారు. ప్రత్యేకంగా నిధులు విడుదల చేసిన హైడ్రా అధికారులను ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, బిఆర్ఎస్ నేతలు కలిసి సత్కరించారు.కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.





కుర్మల్‌గూడ జెఎన్ఎన్‌యుఆర్ కాలనీలో స్పెషల్ సానిటేషన్ కార్యక్రమాలను పరిశీలిస్తున్న బడంగ్‌పేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ పి.సరస్వతి